ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 21 మార్చి 2025



తిరుపతి ఇందిరా మైదానంలో మెగా హెల్త్ మీట్

ఉచితంగా వైద్యపరీక్షలు, మందుల అందజేత

రేపు, ఎల్లుండి

'ఆంధ్రజ్యోతి- వైద్యజ్యోతి'

తిరుపతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో బాధ పడుతూ ఏ డాక్టర్‌ను కలవాలో తెలియక సతమతవుతున్న వైద్యార్థులకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' అరుదైన వేదికను ఏర్పాటుచేస్తోంది. శని, ఆదివారాల్లో తిరుపతి నగరం తుడా కార్యాలయం సమీపంలోని ఇందిరా మైదానంలో 'వైద్య జ్యోతి' పేరిట ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో తిరుపతిలోని ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో ఉచిత హెల్త్ మీట్ ఉంటుంది. రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే వైద్యజ్యోతిలో రోగులను పరీక్షించి అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారు. కొన్నిరకాల మందులను కూడా ఉచితంగా అందించనున్నారు. వెంకటరమణ గుండె, మెటర్నిటీ హాస్పిటల్, మనోహరి రామచంద్ర హాస్పిటల్, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, అంకుర హాస్పిటల్, డీఎన్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, యష్ హాస్పిటల్స్, శ్రీసాయి సుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డీబీఆర్ అండ్ ఎస్కే క్యాన్సర్ సెంటర్, కాకర్ల డెంటల్ హాస్పిటల్, కృష్ణతేజ డెంటల్ హాస్పిటల్, మెడిగో హాస్పిటల్స్, సన్‌ప్రైమ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యులు, వైద్య సిబ్బంది వైద్యజ్యోతి హెల్త్ మీట్‌లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ (ఎన్‌బీకే) ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు పి.మనోహర్‌రెడ్డి, కేపీ చౌదరి ప్రధాన స్పాన్సర్‌గాను.. సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు కో స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. వైద్యజ్యోతి శిబిరంలో ప్రజలు పాల్గొని ఆరోగ్య సమస్యలకు ఉచితంగా పరిష్కారం పొందవచ్చు. ఈ కార్యక్రమం తర్వాత కూడా సంబంధిత ఆస్పత్రులలో ప్రత్యేక రాయితీలతో వైద్య సదుపాయం పొందే అవకాశం ఉంది.





భూ సమస్యలను పరిష్కరించాలి

మా నియోజకవర్గంలో పట్టాలు పొంది రైతులు సేద్యం చేసుకుంటున్నారు. ఇప్పుడా భూములను రిజర్వ్ ఫారెస్ట్ అధికారులు తమ వంటూ లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా కేవీబీపురం మండలం కళత్తూరు, వేములపాడు, వగత్తూరుతో పాటు పలుచోట్ల ఈ సమస్యలు ఉన్నాయి. వీటిని పరిష్కరించాలి. బీఆర్ అంబేద్కర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి.

- కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

'వర్గీకరణ'పై రాద్ధాంతం వద్దు



ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా సీఎం చంద్రబాబు చరిత్రలో గుర్తుండిపోతారు. దీనిపై కొందరు రాద్ధాంతం చేయడం మంచిపద్ధతి కాదు. వర్గీకరణ గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపైనే ఉంది.

- పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్యే

కృత్రిమ మేధతో అనుసంధానం చేయాలి



శేముషి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చాన్సలర్ గోపాలస్వామి, వీసీ కృష్ణమూర్తి తదితరులు


జాతీయ సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవంలో చాన్సలర్ గోపాలస్వామి

42 మందికి బంగారు పతకాలు, 75 పీహెచ్‌డీలు, 564 మందికి డిగ్రీలు ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి వంటి గొప్ప కేంద్రంలో సంస్కృత విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధిని పొందడం సంతోషకరం. ఇప్పటికే జరిగిన ప్రగతితో పాటు భవిష్యత్తు ప్రణాళిక కూడా అత్యంత పటిష్ఠంగా కలిగి ఉంది. భవిష్యత్తులో కృత్రిమ మేధతో అనుసంధానం చేయాల్సిన అవసరముంది. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు' అని భారత మాజీ ఎన్నికల ప్రధానాధికారి గోపాలస్వామి పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన 4వ స్నాతకోత్సవంలో ఆయన చాన్సలర్ హోదాలో ప్రసంగించారు. స్నాతకోత్తర పట్టాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు. సంప్రదాయ, ఆధునిక శాస్త్రాల మేళవింపుగా సంస్కృత వర్సిటీ పని చేస్తోందన్నారు. చిన్నారులకు సంస్కృత భాషను నేర్పేందుకు బాల కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. సంస్కృతంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. వర్సిటీ మాజీ చాన్స్‌లర్ డాక్టర్ వీఆర్ పంచముఖి వర్చువల్‌గా మాట్లాడారు. గొప్ప విద్యాకేంద్రమైన సంస్కృత వర్సిటీకి తాను చాన్సలర్‌గా పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. సంస్కృత అధ్యయనాలు, సంప్రదాయ శాస్త్రాల బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీ కృషి చేస్తున్నట్లు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి వివరించారు. కాలానుగుణంగా అనేక కొత్త కోర్సులు, కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాక్‌శాస్త్రిలో లక్ష్మీప్రసన్న, డిగ్రీలో వై.జానకి, పీజీలో అమిత విక్రమ్ ఓవరాల్ టాపర్లుగా నిలిచి బంగారు పతకాలను సాధించారు. వీరితో పాటు వివిధ విభాగాల్లో కోర్సులు పూర్తి చేసుకున్న 564 మంది విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలను.. 42 మంది బంగారు పతకాలు, 75 మందికి పీహెచ్‌డీలను అందజేశారు. త్రివేంద్రంకు చెందిన షాజీన్ మహమ్మద్ తాజుద్దీన్ ముస్లిం కుటుంబంలో పుట్టినా, వైదిక శాస్త్ర విద్యలో ప్రావీణ్యాన్ని సాధించడంపై పలువురు అభినందించారు. ఈయన పీహెచ్‌డీ పట్టా స్వీకరించారు.

పలు పుస్తకాల ఆవిష్కరణ

రామానుజ ప్రాజెక్టులో భాగంగా సురపురం శ్రీనివాసాచార్య రాసిన 'సిద్ధాంత చింతామణి' పుస్తకాన్ని ప్రొఫెసర్ కేఈ దేవనాథన్.. పరిశోధన-ప్రచురణల విభాగం రూపొందించిన 'మహస్విని' పత్రికను ప్రొఫెసర్ శివరామభట్ ఆవిష్కరించారు. యూనివర్సిటీ న్యూస్ లెటర్ 'శేముషి'ని డాక్టర్ సోమనాథదాస్ ఆవిష్కరించారు.



రేణిగుంట విమానాశ్రయంలో వినతులను స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు



తిరుమలలో నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమలకు సీఎం చంద్రబాబు

శ్రీవారి దర్శనార్థం సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా గురువారం రాత్రి 11.30 గంటలకు తిరుమల చేరుకున్నారు. సాయంత్రమే నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, దేవాన్ష్ తిరుమలకు రాగా.. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాత్రి వచ్చారు. విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, సుధీర్‌రెడ్డి, జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు స్వాగతం పలికారు. విమానాశ్రయం వద్ద వేచి ఉన్న జనం నుంచి సీఎం చంద్రబాబు వినతిపత్రాలు స్వీకరించి తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పద్మావతి పార్కును హోల్డింగ్ పాయింట్‌గా నిర్ణయించలేదు



విచారణ అనంతరం తిరిగి వెళుతున్న పూర్వ ఎస్పీ సుబ్బరాయుడు

- భక్తులు కాకతాళీయంగా వెళ్లారు
- దురదృష్టవశాత్తు ఘటన జరిగింది
- ఏకసభ్య కమిషన్ విచారణలో పూర్వపు ఎస్పీ సుబ్బరాయుడు
- 'తొక్కిసలాట' ఘటనపై నేడూ కొనసాగనున్న విచారణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 'తొక్కిసలాట' ఘటనపై గురువారమూ ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి విచారణ కొనసాగించారు. అప్పటి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు నాటి సంఘటనపై వాంగ్మూలం ఇచ్చారు. 'వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీకి తిరుపతి నగరంలో పలుచోట్ల కేంద్రాలను టీటీడీ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా బైరాగిపట్టెడలో రామానాయుడు జడ్పీ ఉన్నత పాఠశాలలో కౌంటర్లను ఏర్పాటు చేశాం. భక్తులు కాకతాళీయంగా పద్మావతి పార్కులోకి విశ్రాంతి కోసం వెళ్లారు. దీనిని మేము హోల్డింగ్ పాయింట్‌గా ఏర్పాటు చేయలేదు' అని కమిషన్‌కు, క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన న్యాయవాదులకు నాటి ఎస్పీ సుబ్బరాయుడు చెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దురదృష్టవశాత్తు సంఘటన జరిగిందని, సకాలంలోనే బాధితులను ఆస్పత్రికి తరలించి వైద్యం అందించామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. సంఘటన సమయంలో తాను వేరే ప్రాంతంలో బందోబస్తు పర్యవేక్షిస్తున్నానని, ఎస్పీగా పర్యవేక్షణ బాధ్యత తనదేనని, కానీ, పార్కు గేటుకు తాళాలు వేసిన నిర్ణయం తనది కాదని చెప్పినట్లు తెలిసింది. కింది స్థాయి ఉద్యోగులు నిర్ణయం తీసుకుని ఉండవచ్చన్నారు. ఈ ఘటనలో సస్పెండైన డీఎస్పీ రమణకుమార్ తరపున లాయర్లు పూర్వపు ఎస్పీ సుబ్బరాయుడిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసినట్లు సమాచారం. ఇక తొక్కిసలాట ఘటనలో గాయపడిన అన్నమయ్య జిల్లా రామసముద్రంకు చెందిన ముగ్గురు, వైజాగ్‌కు చెందిన ఒక బాధితుడు కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితులను, నాటి ఎస్పీ సుబ్బరాయుడిని జస్టిస్ సత్యనారాయణమూర్తి విచారించారు. కాగా, అధికారులతో పాటు ఆనాడు పార్కు వద్ద విధుల్లో ఉన్న వారు పెద్దసంఖ్యలో విచారణకు వచ్చారు. ఇక, అప్పటి టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌ను శుక్రవారం ఏకసభ్య కమిషన్ విచారించనుంది.

పీఎం యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి యోగా అవార్డు 2025 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో కె.మోహన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉత్తమ ప్రతిభ కనబరిచిన, యోగాను ప్రోత్సహించిన, సమాజంపై గణనీయ ప్రభావాన్ని చూపిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి వ్యక్తులు, సంస్థలు పీఎం యోగా అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 0877-2286921, 9440573537, 7036428726లను సంప్రదించాలని కోరారు.

ఫార్మసీ ఆఫీసర్ ఉద్యోగ నియామకాలు తాత్కాలిక వాయిదా

తిరుపతి(వైద్యం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): కడప జోనల్ పరిధిలో ఇటీవల విడుదల చేసిన ఫార్మసీ ఆఫీసర్ పోస్టుల నియామకాలను హైకోర్టు ఉత్తర్వుల మేరకు తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆర్డీ రామగిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఫార్మసీ ఉద్యోగాలకు సంబంధించి జనవరి 3న వచ్చిన నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు రావడంతో తాత్కాలికంగా వాయిదా వేయాలని కోర్టు ఆదేశించిందని పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

స్విమ్స్‌లో పలు కోర్సులకు ఏపీ.ఈఏపీసెట్ ర్యాంకుల ఆధారంగా అడ్మిషన్లు

తిరుపతి(వైద్యం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో బీఎస్సీ(నర్సింగ్) బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బీఎస్సీ అలైడ్ హెల్త్‌సైన్సెస్(పారా మెడికల్) కోర్సుల్లో 2025-26 సంవత్సరానికి ఏపీ.ఈఏపీసెట్ ఆధారంగా మాత్రమే భర్తీ చేయనున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పై కోర్సులకు ప్రవేశం పొందాలంటే కచ్చితంగా ఏపీ.ఈఏపీసెట్-2025 అర్హత పొంది ఉండాలని పేర్కొన్నారు. ఏపీఈఏపీసెట్ ఫలితాలు ప్రకటించిన తర్వాత ఏపీ ఆన్‌లైన్, స్విమ్స్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:57 (శనివారం ఉదయం)

27న స్థానిక సంస్థల ఉప ఎన్నికలు

- ఒక ఎంపీపీ, నాలుగు ఉప సర్పంచి స్థానాలకు..

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కారణాలతో స్థానిక సంస్థల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు పరోక్ష విధానంలో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 27న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణతో మొదలై మధ్యాహ్నం ఒంటి గంటతో ప్రమాణస్వీకారంతో ముగియనుంది. వీటిలో తిరుపతి రూరల్ ఎంపీపీ పదవితో పాటు రేణిగుంట మండలం గురవరాజుపల్లి, చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కోట మండలంలోని ఎన్‌పీ కొత్తపాళెం, ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీల్లో ఉప సర్పంచికి ఎన్నికలు జరగనున్నాయి. కాగా, తిరుపతి రూరల్ ఎంపీపీగా వ్యవహరించిన మోహిత్‌రెడ్డి గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి రాజీనామా చేశారు. ఇన్ని రోజులు తిరుచానూరు ఎంపీటీసీ యశోద ఇన్‌ఛార్జి ఎంపీపీగా వ్యవహరించారు. ఈ నెల 27న ఎన్నికల నేపథ్యంలో 30 మంది ఎంపీటీసీలను ముంబయిలోని ఓ రిసార్టుకు తరలించినట్లు తెలిసింది.

జిల్లా పరిశ్రమల అధికారిగా సుధాకర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా కేపీ సుధాకర్ గురువారం ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నడకదారిలో పాము



నడక మార్గంలో, మేదరమిట్ట వద్ద పాములను పట్టుకున్న భాస్కర్ నాయుడు

అలిపిరి కాలినడక మార్గంలో గురువారం ఎనిమిది అడుగుల జెర్రిపోతు పాము పట్టుబడింది. గాలిగోపురం వద్దనున్న ఓ దుకాణంలోకి ప్రవేశించిన పామును భాస్కర్ నాయుడు బంధించి అడవిలో వదిలారు. అలాగే తిరుమలలోని మేదరమిట్ట ప్రాంతంలోని బరోడా బ్యాంక్‌పై భాగంలో ఉన్న హెల్త్ కార్యాలయంలో కూడా జెర్రిపోతును భాస్కర్‌నాయుడు పట్టుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎర్రచందనం నిందితుడికి ఏడాది జైలు

రూ.10వేల జరిమానా

తిరుపతి(నేరవిభాగం),మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ స్పెషల్ కోర్టు గురువారం తీర్పునిచ్చింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు తెలిపిన ప్రకారం.. శ్రీకాళహస్తి పరిధిలోని మేళ్ల చెరువుకు చెందిన మంగళంపేట చిన్నబాబు, యల్లంపల్లి జయరామయ్య, మేకల నరసింహులు, చెంగ్రాయులు, పి.గంగయ్య 2016లో మేళ్లచెరువు కట్ట నుంచి ఎర్రచందనం తరలిస్తూ పోలీసుల కంటబడ్డారు. చిన్నబాబు, జయరామయ్య దొరకగా మిగిలిన ముగ్గురు పారిపోయారు. కేసు నమోదు చేసి, ఇద్దరిని అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దాదాపు తొమ్మిదేళ్ల పాటు కేసు విచారణ కొనసాగింది. వాదనలు విన్న కోర్టు రెండో నిందితుడు ఎల్లంపల్లి జయరామయ్యపై సాక్ష్యాధారాలు రుజువు కావడంతో ఏడాది పాటు కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చింది. ఒకవేళ జరిమానా చెల్లించకుంటే మరో మూడు నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది.

వెటర్నరీ విద్యార్థుల సమ్మె విరమణ

తిరుపతిరూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు 45 రోజుల పాటు నిర్వహించిన నిరవధిక సమ్మెను గురువారం మధ్యాహ్నం విరమించారు. స్టైఫండ్‌ని పెంచుతూ రెండ్రోజుల క్రితం ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో సమ్మె విరమించారు. వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జగపతిరామయ్య వర్సిటీ ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్దకు చేరుకుని విద్యార్థులకు నిమ్మరసాన్ని అందించి సమ్మెను విరమింపజేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి విద్యార్థులు పాలాభిషేకం చేశారు. వైద్య విద్యార్థుల మాదిరిగా తమకూ స్టైఫండ్ పెంచాలని కోరామని, స్పందించిన ప్రభుత్వం ప్రస్తుతం 50శాతం వరకు అదనంగా పెంచిందని విద్యార్థులు తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్‌లను కలసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

డాక్టర్ల పేరిట రుయాలో

రూ.14.55 లక్షల ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా!

● హెచ్‌వోడీపై డీఎంఈకి ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీలో వైద్యసేవలు అందించిన డాక్టర్లకు ప్రభుత్వం ప్రోత్సాహం కింద అందించిన రూ.14.55 లక్షలను ఓ హెచ్‌వోడీ స్థాయి అధికారి స్వాహా చేశారంటూ ఇటీవల కొందరు డీఎంఈ(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)కి ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. రుయాలో ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలు నిర్వహిస్తే.. ఆయా డాక్టర్లతోపాటు విభాగాల వారీగా అధికారులు, సిబ్బందికి ఆరోగ్యశ్రీ నిధుల్లో నుంచి కొంత నగదు జమవుతుంది. ఈ మొత్తం ఏడాదికోసారి వీరందరి ఖాతాల్లోకి చేరుతుంది. అయితే ఓ విభాగాధిపతి కొందరు పీజీ డాక్టర్ల పేరుతో 2023 నవంబరులో రూ.3,92,511, డిసెంబరులో 10,62376 వంతున రూ.14,54,887 స్వాహా చేశారని అప్పట్లో ఆరోగ్యశ్రీ కింద విధులు నిర్వహించిన ఓ డాక్టర్ గత నెల 14న డీఎంఈకి ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి నివేదిక అందించాలని డీఎంఈ నరసింహం రుయాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ఆర్థో విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్ చైర్మన్‌గా, ప్రొఫెసర్ డాక్టర్ కిరీటి, ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌భాస్కర్ సభ్యులుగా విచారణ కమిటీని నియమించినట్లు తెలిసింది. వీరు వారం రోజులుగా విచారణ నిర్వహిస్తున్నారు. అయితే, ఇక్కడ పనిచేసే డాక్టర్లతో కాకుండా బయట వైద్య కళాశాలలు, ఆస్పత్రులకు చెందిన వారితో విచారణ నిర్వహించాలన్న డిమాండూ వినిపిస్తోంది. దీనిపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌ను వివరణ కోరగా.. ఈ విషయంపై విచారణ పూర్తయిన తరువాత ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. అప్పటి వరకు విషయం బయటకు చెప్పకూడదన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఈవో



అన్నదాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవో

తిరుమల, మార్చి20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తిరుమల పర్యటన ఏర్పాట్లను టీటీడీ ఈవో శ్యామలరావు అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి గురువారం పరిశీలించారు. ముందుగా పద్మావతి విశ్రాంతి గృహంలో వసతి ఏర్పాట్లను చూశారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1, శ్రీవారి ఆలయంలో తనిఖీలు నిర్వహించారు. వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకుని సీఎం, వారి కుటుంబ సభ్యులు చేసే అన్నప్రసాద సేవకు సంబంధించిన ర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీఈవోలు లోకనాథం, రాజేంద్ర, భాస్కర్, వీఎస్వో సురేంద్ర, పేష్కార్ రామకృష్ణ, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ముందంజ వేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న సుధారెడ్డి

పాకాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాయితీ రుణాలను, పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధితో మహిళలు అన్ని రంగాలలో ఎదగాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధా రెడ్డి కోరారు. గురువారం దామలచెరువు షాదీ మహల్, హైస్కూల్ గేటు భారతంమిట్ట, చిట్టిమనాయనచెరువుపల్లె రోడ్డు మామిడి మండీల్లో మహిళలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో తినుబండారాలు విక్రయిస్తున్న దామలచెరువుకు చెందిన భువనేశ్వరిని ఆమె అభినందించారు. మహిళలు పట్టుదలతో ప్రణాళికతో పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకువస్తే ఏర్పాటు చేయడానికి తగిన సహకారం అందజేస్తామన్నారు. జడ్పీటీసీ పద్మజ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, కార్యదర్శి ఫల్గుణ, కె.సావిత్రి, సర్పంచ్ సునీత, ఎంపీటీసీ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రాథమిక వసతులు కల్పించాలని నిరసన



తిరుపతి రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): తనపల్లె ఇందిరమ్మ కాలనీలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నేతలు ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి కోరారు. గురువారం కాలనీ ప్రజలతో కలసి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద రేషన్‌కార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో బోర్లు మరమ్మతులకు గురికావడంతో నీటికోసం తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. 800 ఇళ్లు ఉన్నా దూర ప్రాంతాలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. తనపల్లెలోని అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి పిల్లలను పంపడం ఇబ్బందిగా ఉందన్నారు. సీపీఎం నాయకులు నరేంద్ర, మునిరాజ్, చిరంజీవి, యుగంధర్, మధు, గణేష్, శ్రీవాణి, రత్నమ్మ, లక్ష్మి, అమరావతి, జ్యోతి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): జూపార్క్‌రోడ్డులోని మహాత్మ జ్యోతిబా ఫులే బాలికల గురుకుల పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరానికి గాను 5వతరగతి, బ్యాక్‌లాగ్‌లో 6నుంచి9తరగతుల ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 5వ తరగతిలో ఖాళీగా 80సీట్లు, 6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కె.రేష్మ కోరారు. ఈనెల25వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందనిన్నారు. వచ్చేనెల 27న 5వతరగతి ప్రవేశానికి పరీక్ష ఉంటుందన్నారు. అదేనెల 28న బ్యాక్‌లాగ్ విద్యార్థులకు పరీక్ష జరుగుతుందని ప్రకటించారు. పూర్తి వివరాలకోసం 9490588509 నంబరులో సంప్రదించాలని కోరారు.

మాడవీధిలో మొక్కల కుండీల ఏర్పాటు



తిరుమల, మార్చి20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తిరుమల పర్యటన నేపథ్యంలో శ్రీవారి ఆలయ మాడవీధిలో మొక్కల కుండీలను ఏర్పాటు చేశారు. చంద్రబాబు శుక్రవారం ఉదయం శ్రీవారి దర్శనం అనంతరం తూర్పు మాడవీధి గుండా వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకోనున్నారు. ఈక్రమంలో ఆమార్గంలో టీటీడీ ఉద్యానవన విభాగం చెట్ల మొక్కల కుండీలను ఏర్పాటు చేసింది. తూర్పుమాడవీధి పచ్చదనం అందాలతో దర్శనమిస్తోంది.

24న టూరిస్టు బస్టాండుకు వేలం

తిరుచానూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ టూరిస్టు బస్టాండు, షాపింగ్ కాంప్లెక్సుకు ఈనెల 24న బహిరంగ వేలం వేస్తున్నట్లు ఈవోపీఆర్డీ, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి మాధురిలో గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత ఈనెల 19న ప్రైవేటు బస్టాండుకు బహిరంగ వేలంపాట వేయాలని నిర్ణయించినా అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. ఈ క్రమంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు.

ఆక్రమిత స్థలంలో ప్రహరీ తొలగింపు



తిరుపతి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట పంచాయతీలో సర్వేనంబరు18/2లోని బండిబాటను ఆక్రమించి నిర్మించిన రేకులషెడ్డు ప్రహరీని గురువారం స్థానిక వీఆర్వో రమేష్ సమక్షంలో ఎక్స్‌వేటర్ సాయంతో కొంతభాగాన్ని తొలగించారు. దీనిపై తహసీల్దార్ రామాంజులునాయక్‌కు గ్రామస్తుల నుంచి ఫిర్యాదు రావడంతో ఆయన స్పందించారు. పంచాయతీలో అంకాళమ్మ గుడి వద్ద నుంచి బండిబాట స్థలం ఆక్రమణల్లో ఉందని, దీన్ని సర్వేచేసి పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు పలువురు కోరుతున్నారు. కొంతభాగాన్ని మాత్రమే తొలగించడం విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కళాశాలల ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అనుబంధ కాలేజీలను వీసీ అప్పారావు తనిఖీ చేశారు. కేకేసీ కాలేజీని గురువారం ఆయన తనిఖీ చేశారు. బీఈడీ, ఎంబీఏ కాలేజీలకు సంబంధించిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు ఎవ్వరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఈడీ కాలేజీలో నర్సింగ్ కాలేజీ నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. యూనివర్సిటీకి అనుబంధంగా నిర్వహిస్తున్న కోర్సులను ఎందుకు రద్దు చేయకూడదో నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఆకతాయిల ఆగడాలను అరికట్టండి



పోలీసులకు విన్నవిస్తున్న మహిళలు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సుందరయ్యనగర్‌లోని బాలాజీ దోబీఘాట్ వద్ద ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయని, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆ ప్రాంత మహిళలు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆకతాయిల చేష్టలను పోలీసులకు వివరించారు. ఆ ప్రాంతంలో బుక్ పాయింట్ ఏర్పాటు చేసి, ఆకతాయిల ఆగడాలని నివారిస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డాక్టర్ పి.సాయిలక్ష్మి, జయచంద్ర, నరేంద్ర, వెంకటముని, రంగయ్య, మునిరత్నం, రవి పాల్గొన్నారు.

తాగునీరు వృథా



తిరుపతి అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మంగళంలోని తిరుమలనగర్ మీదుగా ఫిల్టర్‌హౌస్‌కు సరఫరా అవుతున్న నీరు కొన్నాళ్లుగా నేలపాలవుతున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోతోంది. గాలి పైపు నుంచి నీరు జోరుగా కారుతోంది. ఆ నీటిని స్థానికులు చక్కగా పెరటితోటలకు వాడుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా తెలుగుగంగ యంత్రాంగం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆరంభం 'షో'యేనా..!

● నిలిచిన సౌండ్,లైటింగ్ ప్రదర్శన

● చంద్రగిరి కోట సందర్శకుల నిరాశ



చంద్రగిరి కోటలో సౌండ్, లైటింగ్ షో (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇక్కడి కోటలో ఏర్పాటు చేసిన సౌండ్,లైటింగ్ షో ఆరంభశూరత్వాన్ని తలపిస్తోంది. టూరిజం కార్పొరేషన్ పబ్లిక్ ప్రవేట్ పార్టనర్షిప్ విధానంలో లక్స్ అండ్ డెసిబిల్స్ సంస్థ ఆధ్వర్యంలో దీనిని ప్రారంభించి ఆరు నెలలు అవుతున్నా ప్రదర్శనకు నోచుకోలేదు. 2000లో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, పురావస్తుశాఖతో సంప్రదించి పర్యాటకులను ఆకర్షించేందుకు చంద్రగిరి కోటలో లైటింగ్ షోను ఏర్పాటు చేయించారు. టూరిజంశాఖ ఆధ్వర్యంలో షోను ప్రదర్శించేవారు. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వం రూ.3.50 కోట్లతో లక్స్ అండ్ డిజబుల్ సంస్థ(చెన్నై) ద్వారా లైటింగ్ షోను ఆధునికీకరించారు. 2018 జూలైలో కోట రాజు గోపురంపై పిడుగు పడటంతో లైటింగ్ షో వ్యవస్థ పాడైంది. షో నిలిచిపోయింది. గతేడాది ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున కోటలో సౌండ్ అండ్ లైట్ షోను మళ్లీ ప్రారంభించారు. ప్రయివేటు సంస్థకు షో నిర్వహణ అప్పగించడంతో మళ్లీ ఒప్పందాలు చేసుకోవాలని పురావస్తుశాఖ ఆదేశించింది. దీంతో ప్రవేటు సంస్థ మళ్లీ ప్రతిపాదనలు పంపింది.పురావస్తుశాఖ నుంచి ఇంకా అనుమతి రాలేదు. కోట సందర్శకులు ఈ షో లేక నిరాశతో వెనుతిరుగుతున్నారు.

త్వరలోనే షో ప్రారంభిస్తాం...



సౌండ్‌లైటింగ్ షో త్వరలోనే ప్రారంభిస్తాం. కేంద్ర పురావస్తుశాఖ సాంకేతిక పరమైన కారణాలపై ప్రతిపాదనలు పంపమంది. ఇప్పటికే పంపాము. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే అనుమతి వస్తుంది. రాగనే షో అందుబాటులోకి తీసుకువస్తాం.

-రమణ ప్రసాద్, రీజనల్ డైరెక్టర్, ఏపీ టూరిజం.

రూరల్ ఎంపీపీ కోసం వైసీపీ క్యాంప్ రాజకీయం?

షిర్డీ యాత్రకు విమానమెక్కిన సభ్యులు

తిరుపతిరూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల ఎంపీపీ ఎన్నిక రాజకీయం వేడెక్కుతోంది. పెరుమాళ్లపల్లె-1 ఎంపీటీసీగా ఉన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆపదవికి రాజీనామా చేయడంతో గతేడాది జనవరి నుంచి అదేపార్టీకి చెందిన తిరుచానూరు-6 ఎంపీటీసీ వేముల శారద ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్నారు. ఈక్రమంలో ఈనెల27న ఎంపీపీ ఎన్నిక జరగనుంది. ఏడాదిన్నరకిపైగా గడువు ఉండడంతో ఎంపీపీ పదవి చేజారకూడదని వైసీపీ నేతలు అప్పుడే క్యాంప్ రాజకీయానికి తెరలేపారని తెలుస్తోంది. గురువారం ఉదయం తిరుపతి నుంచి విమానంలో దాదాపు 30మంది ఎంపీటీసీ సభ్యులను ముంబై, చెన్నై నగరాలకు తీసుకెళ్లారని చెబుతున్నారు. వీరిని అక్కడి నుంచి షిరిడీకి తీసుకెళ్లి ఈనెల24న తిరిగి తిరుపతి తెచ్చేందుకు ఏర్పాట్లు చేశారని చర్చించుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కటుంబసభ్యులతో ఎంపీటీసీలు కలసి షిరిడీయాత్రకు వెళ్లారని స్థానిక వైసీపీ నేతలు చెబుతున్నారు. మండలంలో ప్రస్తుతం 37మంది సభ్యులున్నారు. వీరిలో 36మంది వైసీపీ తరపున ఎన్నికవ్వగా..పెరుమాళ్లపల్లె-2 ఎంపీటీసీ తేజశ్వి ఇండిపెండెంట్‌గా ఎన్నికయ్యారు. 19మంది సభ్యుల మద్దతు విజయానికి అవసరం. అధికార కూటమి నేతల వైఖరి ఇప్పటివరకూ బహిర్గతం కాలేదు.

శానిటరీ మేస్త్రీపై హత్యాయత్నం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): శానిటరీ మేస్త్రీపై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం డీఆర్ మహల్ రోడ్డులో చోటు చేసుకుంది. సీఐ రామకృష్ణ వివరాల మేరకు.. 16వ వార్డులో విధులు నిర్వహిస్తున్న శానిటరీ మేస్త్రీ తులసీరాం తండ్రికి కొందరితో గొడవలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు గురువారం డీఆర్ మహల్ రోడ్డులో విధుల్లో ఉండగా తులసీరాంపై కర్రలు, రాడ్లతో దాడి చేశారు. తల, ఎడమ చేతిపై గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తిరుపతి రుయాకు తరలించారు. ప్రస్తుతం పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నట్లు రుయా వైద్యులు చెప్పారు. ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

తిరుపతి(ఆటోనగర్), మార్చి20 (ఆంధ్రజ్యోతి): శానిటరీ మేస్త్రీ తులసీరామ్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ నాయకులు వేణు, టి.సుబ్రమణ్యం, బుజ్జి డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తులసీ రామ్‌ను గురువారం వారు పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. పట్టపగలు నలుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేయడంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక రంజాన్



మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజరు ఉమాపతి

తిరుపతి(ఆటోనగర్) మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో, ఉపవాసాలు చేసుకునే పండగే రంజాన్ అని కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజరు ఉమాపతి అన్నారు. రాస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ముస్లిం మహిళలకు రాస్ నిర్వాహకులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉమాపతి మాట్లాడుతూ రంజాన్ పండుగ సమయంలో ముస్లింలు ఆచరించే విధానాలు చాలా గొప్పవన్నారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా చేతివృత్తుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. డైరెక్టర్ వి.నాగరాజు మాట్లాడుతూ తమ సంస్థ కులమతాలకతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రియాజ్, మౌలానా, ముర్వర్ వాణి, కరుణాకర్, బాలాజీ, నాగరాజు, మునిరాజా, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని యువత స్వీకరించాలి



సభలో మాట్లాడుతున్న రాఘవశర్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం భగత్‌సింగ్ చేసిన పోరాటంలోని స్ఫూర్తిని యువత స్వీకరించాలని పీడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, భాస్కర్ పేర్కొన్నారు. పీడీఎస్ఓ ఆధ్వర్యంలో ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో నిర్వహించిన భగత్‌సింగ్ వర్ధంతి సభలో వారు పాల్గొని మాట్లాడారు. చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగశీలి భగత్‌సింగ్ అని అన్నారు. విద్య, ఉద్యోగ హక్కుల సాధన కోసం ప్రయత్నించాలన్నారు. చదువుతో పాటు సమాజం కోసం పోరాడాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ, ఎస్వీయూ హిస్టరీ అధ్యాపకులు డాక్టర్ గోవిందులు మాట్లాడుతూ సమాజంలోని దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా యువత పోరాడాలన్నారు. పీడీఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆశ, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమన ఇంటి వద్ద పోలీసులు



వైసీపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అభినయ్, వైసీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇంటి వద్ద పోలీసులు మొహరించారు. గురువారం రాత్రి తిరుమలకు వస్తున్న సీఎం చంద్రబాబు కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసి చంద్రగిరి, తిరుచానూరు సీఐలు సుబ్బురామిరెడ్డి, సునీల్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో వైసీపీ నేతలు, శ్రేణులు పార్టీ కార్యాలయం వద్ద జగన్ ఫ్లెక్సీలతో బైఠాయించి నిరసన తెలియచేశారు. ఈ నిరసనలో భూమన అభినయ్‌తో పాటు తిరుపతి టౌన్ బ్యాంకు చైర్మన్ జయచంద్రా రెడ్డి, వైస్ చైర్మన్ సహదేవ యాదవ్, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రా రెడ్డి, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై హెచ్‌వోడీ ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్నతాధికారులపై విమర్శలకు పాల్పడుతున్నారంటూ ఎస్వీ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ జనరల్ మెడిసిన్ డాక్టర్ ఇ.వి.రమణయ్యపై జనరల్ మెడిసిన్ విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రుషేంద్రకుమార్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈయన రోగుల పట్ల, ఇతర డాక్టర్లు, వైద్య సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని అందులో ఆరోపించారు. దీనిపై అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని లిఖితపూర్వక ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. విచారణ చేపడుతున్నామని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన మేధో గురుదక్షిణామూర్తికి గురు వారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ పూజ చేశారు. తర్వాత అభిషేకం జరిపించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించు కున్నారు.

యూనివర్సిటీలను ప్రక్షాళన చేయండి

● సీఎంకు తెలుగు యువత నేత ఆనంద్‌గౌడ్ విన్నపం



సీఎం చంద్రబాబు నాయుడుతో రాగల ఆనంద గౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిన యూనివర్సిటీలను పూర్తిగా ప్రక్షాళన చేయాలని సీఎం చంద్రబాబును తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనందగౌడ్ కోరారు. ఈ మేరకు అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆనంద గౌడ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీల పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. ఇష్టారాజ్యంగా నిర్ణయాలు చేశారని ఆరోపించారు. వాటిని సమీక్షించాలన్నారు. యూనివర్సిటీల్లో ఉద్యోగ నియామకాలకు చర్యలు తీసుకుంటుండడం శుభ సూచకమన్నారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయండి



మౌర్యకు వినతిప్రతం ఇస్తున్న నాయకులు

తిరుపతి, మార్చి20(ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని న్యూ బాలాజీ కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్యను డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు కోరారు. గురువారం డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్కే బాబు, నరసింహాచారి, నరేంద్రనాథ్‌లు కమిషనర్‌ను కలసి పలు అభివృద్ధి పనుల కోసం విన్నవించారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు చేపడతామని, రంజాన్ ప్రార్థనలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కమిషనర్‌ను కలసిన వారిలో తిరుత్తణి వేణుగోపాల్, కమిటీ సభ్యులు ఉన్నారు.





తిరుమల పర్యటనకు గురువారం రాత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి స్వాగతం పలుకుతున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తినాని,బొజ్జల సుధీర్‌రెడ్డి

వైసీపీ నీతులు మాట్లాడటం సిగ్గుచేటు

అన్నా అనిత


సమావేశంలో మాట్లాడుతున్న అనిత

తిరుపతి(జీవకోన), మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, పథకాల అమలు గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని టీడీపీ నేత, కార్పొరేటర్ అన్నా అనిత విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీనీ ప్రభుత్వం అమలు చేస్తుందని స్పష్టం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు గురించి వైసీపీ నేతలు ఆర్టీసీ బస్సుల్లో వికృత చేష్టలు చేస్తూ కార్యక్రమాలు నిర్వహించడాన్ని తప్పుపట్టారు. గత ఐదేళ్ల కాలంలో తిరుపతిలో వారు చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు 63వేల ఓట్ల మెజార్టీతో కూటమి అభ్యర్థిని గెలిపించారని ఎద్దేవా చేశారు. అట్టడుగు స్థాయిలో ఉన్న రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు దశలవారీగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. వీర మహిళ ఆకేపాటి సుభాషిణి మాట్లాడుతూ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా వైసీపీ నేతల తీరులో ఏ మాత్రమూ మార్పు రాలేదని, త్వరలోనే ఉచిత బస్సు హామీని ప్రభుత్వం నెరవేరు స్తుందని అన్నారు.కార్పొరేటర్లు దూది కుమారి, నీకే రేవతి, శైలజ, కల్పనయాదవ్, నాయకులు శ్యామలమ్మ, లత, శ్యామల, రాజ్యలక్ష్మి, రాధ పాల్గొన్నారు.

తిరుపతి

మెడికల్ కిట్ల పంపిణీ



మంగళం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి గురువారం టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బరాయుడు మెడికల్ కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అడవుల్లో కూంబింగ్‌కు వెళ్లే సిబ్బందికి గాయలవుతుంటాయని, వారికోసం టాబ్లెట్లు, పెయిన్ జెల్, ఓఆర్ఎస్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, మోకాలి కేప్‌లు, బెల్టులు, సర్జికల్ డ్రెస్సింగ్ బ్యాండేజీతో పాటు 15 రకాల మందులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీలు బాలిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఎండీ షరీఫ్, ఆర్ఐ సాయి గిరిధర్, సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ రఫీ, ఏఎస్ఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వో మురళీకృష్ణ పాల్గొన్నారు.

బండి పెట్టాలంటే ముక్కుమూసుకోవాల్సిందే..!

రుయా పార్కింగ్ స్థలంలో మురుగుతున్న బయో వ్యర్థాలు


అత్యవసర విభాగం ముందు పార్కింగ్ స్థలంలో మూడు రోజులుగా మురుగుతున్న వ్యర్థాలు - పార్కింగ్ ప్రదేశంలో పడేసిన ప్లేట్లు

తిరుపతి(వైద్యం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నిత్యం రోగులతో కిటకిటలాడే రుయా ఆస్పత్రిలో పారిశుధ్యం మచ్చుకైనా కానరావడం లేదు. బయో వ్యర్థాలను ఏ రోజుకా రోజు ఆస్పత్రి నుంచి తరలించాల్సి ఉంటుంది. పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సి ఉంటుంది. కానీ ఇందుకు భిన్నంగా రుయాస్పత్రిలో బయో వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని పార్కింగ్ ప్రదేశంలో రోజుల తరబడి నిల్వ చేయడం ఆనవాయితీగా మారింది. దీని పక్కనే నిత్యం పేదలకు అన్నదాన కార్యక్రమాలు జరుగుతుంటాయి. అన్నం తినే వారు ఈ బయో వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. పార్కింగ్ ప్రదేశంలో అడుగు పెట్టాలంటే డాక్టర్లు, సిబ్బంది, ఇతర రోగులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మార్కెట్లు, దుకాణాల వేలం వాయిదా

తిరుపతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించాల్సిన వేలం పాటను 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో శనివారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. కూరగాయల మార్కెట్లతో పాటు వినాయకసాగర్, షాపింగ్ కాంప్లెక్స్, పార్కింగ్ స్థలాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ వంటి వాటికి బహిరంగ వేలం వేయనున్నారు.

జొమోటో డెలివరీ బాయ్స్‌పై దాడి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): జొమోటో డెలివరీ బాయ్‌లపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన గురువారం భారతీ బస్టాండు వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ మహేష్ కథనం మేరకు.. ఇర్లానగర్‌కు చెందిన జశ్వంత్, శ్రీనివాసపురానికి చెందిన విష్ణు జొమోటో డెలివరీ బాయ్‌లుగా పనిచేస్తున్నారు. వీరు ఫుడ్ డెలివరీ కోసం బుధవారం కనకభూషణ లేఅవుట్‌కు వెళ్లారు. ఆ సమయంలో స్థానికంగా కొందరు పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటూ కేక్ కట్ చేస్తున్నారు. జొమోటో డెలివరీ బాయ్‌లను వారు పిలుస్తున్నా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ఆగ్రహించిన సదరు యువకులు గురువారం ఉదయం భారతీ బస్టాండు వద్ద జశ్వంత్, విష్ణులపై దాడి చేశారు. ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెకానిక్స్ సంరక్షణే లక్ష్యం

తిరుపతి అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): టూవీలర్స్ మెకానిక్స్, వారి కుటుంబాల సంరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని శ్రీబాలాజీ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ అన్నారు. గురువారం స్థానిక యూత్‌హాస్టల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో బోస్ కంపెనీ ప్రతినిధుల ద్వారా మెకానిక్స్‌కు బైక్ సర్వీస్ పాయింట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం లేబర్ లైసెన్సు అందజేశారు. సంఘం కార్యదర్శి వి.ఎస్.హరిప్రసాద్, ఉపాధ్యక్షులు చందు, ట్రెజరర్ ఎస్.షఫి, సంయుక్త కార్యదర్శి వి.ఆనంద్, గోపి, మధుకుమార్, ప్రసాద్, జాకీర్, గోపీ, విశ్వనాథ్, ఎన్.ఆర్.బాషా, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారుల చెంతకు శిశువు


శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తున్న రుయా అధికారులు

తిరుపతి(వైద్యం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): బాలికకు పుట్టిన మగబిడ్డకు రుయాస్పత్రిలో 35 రోజులు చికిత్స అందించి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో గురువారం రుయా అధికారులు ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. చిత్తూరు జిల్లా పలమనేరు మండలానికి చెందిన బాలిక గర్భందాల్చి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గత నెల 15న చిత్తూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు. అప్పటికే బాలిక పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఫిబ్రవరి 16న రుయాస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ బాలిక మృతిచెందిన విషయం తెలిసిందే. బిడ్డను చిన్నపిల్లల విభాగంలో ఉంచి చికిత్స అందించారు. శిశువు కోలుకోవడంతో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి, సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, డీసీఎస్ ఆర్ఎంవో శ్రీనివాసులు ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. ఏఆర్ఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి, తిరుమల పర్యటన సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లను కమిషనర్ ఎన్.మౌర్య గురువారం పరిశీలించారు. మామిడికాయల మండి నుంచి అలిపిరి వరకు పారిశుధ్య పనులను,బారికేడ్లను పరిశీలించారు. రోడ్లపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వాలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంట ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసికుమార్, గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

పదోన్నతులపై నిషేధం ఎత్తేయండి

తిరుపతి(ఆటోనగర్), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి దేవస్థానంలో నాలుగేళ్లుగా పదోన్నతులపై కొనసాగుతున్న నిషేధాన్ని ఎత్తేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. నిషేధం కారణంగా ఉద్యోగులు నాలుగేళ్లుగా పదోన్నతులకు నోచుకోలేదన్నారు. వెంటనే తొలగించడమేగాక పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని మారుతీనగర్ ఫీడర్‌లో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా నగరంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. మారుతీనగర్, సంజయ్ గాంధీ కాలనీ, కొర్లగుంట తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భగవద్గీత పోటీల్లో ప్రతిభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీ విద్యార్థులు భగవద్గీత పోటీల్లో ప్రతిభ కనబరిచారు. గీతా ప్రచార సమితి నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు నగదు, ప్రశంసాపత్రాలు అందజేసింది. విజేతలుగా నిలిచిన తొమ్మిది మంది విద్యార్థులను ప్రిన్సిపాల్ నారాయణమ్మ, అభినందించారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం, తిరుచానూరు

తిరుపతి జిల్లా : తిరుపతి రూరల్ మండలం : తిరుచానూరు గ్రామ పంచాయితీ

ప్రైవేటు బస్టాండు, మరియు అంగడి గదుల మరు వేలపు నోటిఫికేషన్

రె.క. నెం. 10/2025 — తేది : 11-03-2025

2025వ సంవత్సరము ఏప్రిల్ నెల 01 తేది మొదలు 2026వ సంవత్సరము మార్చి నెల 31వ తేదీ వరకు కూడిన ఒక సంవత్సరమునకు తిరుచానూరు గ్రామ పంచాయితీకి చెందిన టూరిస్టు బస్టాండు. (APSRTC బస్సులు, ప్రభుత్వ వాహనములు, మరియు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ వాహనములు మినహాయించి) నందు రుసుము వసూలు చేయు గుత్త హక్కును మరియు వాణిజ్య సముదాయపు అంగడి గదులను నెలవారి బాడుగ పద్ధతిపై ఇచ్చుటకు 2025-2026వ సంవత్సరమునకు 24-03-2025వ తేదీ సోమవారం ఉదయం 10-00 గంటల నుండి మధ్యాహ్నం 2-00 గంటల వరకు తిరుచానూరు గ్రామ పంచాయితీ కార్యాలయం నందు గ్రామ పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గానీ సీల్డు టెండర్లు స్వీకరించబడును. అనంతరము సాయంత్రం 3 గంటల నుండి బహిరంగ వేలం వేయబడును. బహిరంగ వేలము తదుపరి సీల్డు టెండర్లను టెండరుదారుల సమక్షమున తెరువబడను. వేలము నందు మరియు సీల్డు టెండరు నందు హెచ్చుపాట ఏదైతే దానినే పరిగణలోనికి తీసుకొనబడును. సదరు బహిరంగ వేలమును నిలుపుదల చేయుటకు, పాక్షికంగా రద్దుపరచుటకు పంచాయితీ కార్యదర్శి వారికి అధికారము కలదు.

చెల్లించవలసిన ధరావత్తు వివరములు

క్రమ సంఖ్య	గుత్త వివరములు	చెల్లించవలసిన ధరావత్తు	సబ్ రిజిస్ట్రారు/ తహశీల్దారు కార్యాలయము నుండి అవసరముగు సాల్వెన్సీ	సాల్వెన్సీ లేనివారు చెల్లించవలసిన ధరావత్తు
1.	ప్రైవేటు టూరిస్టు బస్టాండ్ (APSRTC ప్రభుత్వ వాహనములు, మరియు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ వాహనములు మినహా)	25,00,000	25,00,000	40,00,000
2.	20 అంగడి గదులను (గది నెం. 11 తప్పు) నెలవారి బాడుగ పద్ధతిపై బహిరంగ వేలము ద్వారా కేటాయించుటకు (8వ నెంబరు గల గదిని నాయి బ్రాహ్మణులకు మాత్రమే కేటాయించడమైనది)	20,000	-	-
	అంగడి గది నెం.11నకు (మెట్ల క్రింద గది)	10,000	-	-

షరా-(1) వేలములో పాల్గొనదలచిన వారు గ్రామ పంచాయితీకి ఎటువంటి బకాయిలు ఉండరాదు. ధరావత్తు మొత్తము చెల్లించుటకు జాతీయ బ్యాంకుల నుండి తీసిన డి.డి.లు/బ్యాంకర్స్ చెక్కులు మాత్రమే స్వీకరించబడను. డి.డిలు/బ్యాంకర్స్ చెక్కులు పంచాయితీ సెక్రటరీ, గ్రామ పంచాయితీ, తిరుచానూరు పేరున తీసి వేలమునకు ముందుగా అందజేయవలెను. హెచ్చు పాటదారుల పాటను గ్రామ పంచాయితీ వారు ఖాయపరచిన పిదపనే మిగిలిన డిపాజిట్టుదారులకు నిబంధనల మేరకు వారి డి.డి. లను వారికి వాపసు చేయబడును. బహిరంగవేలము పూర్తి అయిన వెంటనే ఒకటవ, రెండవ హెచ్చు పాటదారుల వేలము డిపాజిట్టు మినహా మిగిలిన వారికి వారు చెల్లించిన డిపాజిట్టు డి.డి.లు/బ్యాంకర్స్ చెక్కులు వాపసు ఇవ్వబడును. (2) నిర్దీత డిపాజిట్లు చెల్లించినవారిని మాత్రమే బహిరంగ వేలమునకు అనుమతించబడును. ఇతరులు బహిరంగ వేలము నందు పాల్గొనుటకు అనుమతించబడదు. మరియు డిపాజిట్టు చెల్లించువారు జి.ఎస్.టి. నెంబరును కలిగి వుండవలెను మరియు పాస్‌పోర్టు సైజు ఫోటో ఒకటి, మరియు నివాసపు నిర్ధారణ కార్డులు అనగా ఆధార్/ఓటరు కార్డు/డ్రైవింగు లైసెన్సు/పాన్ కార్డు/పాస్ పోర్టు/రేషన్ కార్డు ఏదేని ఒకటిని అర్జీకి జతపరచి ఇవ్వవలెను. (3) సాల్వెన్సీ అనగా సబ్ రిజిస్ట్రారు/తహసీల్దార్ కార్యాలయము నుండి పొందిన సాల్వెన్సీ మాత్రమే స్వీకరించబడను. మరియు బ్యాంకు గ్యారంటీ అనగా (సాల్వెన్సీ సర్టిఫికెట్ నందు పొందుపరచబడిన గ్యారంటీ మొత్తము పాటదారుడు చెల్లించని యెడల బ్యాంకు వారు పూచీకత్తుగా ఉండు విధముగా) (4) వేలపుదారుడు వేలము ఖాయపరిచిన 7 రోజుల లోపల వేలపు మొత్తము మరియు ప్రస్తుతం పరిగణలో ఉన్న రేట్ల మేరకు స్టాంపు డ్యూటీ చెల్లించవలెను మరియు నిబంధనల మేరకు ఇన్‌కంటాక్స్ మరియు జి.ఎస్.టి. చెల్లించవలెను.

షెడ్యూలు - 1 (ప్రైవేటు బస్టాండు)
రుసుములు వసూలు చేయవలసిన వివరములు

వ.నెం.	టూరిస్టు బస్టాండు నందు వసూలు చేయవలసిన వాటి వివరములు	వసూలుచేయవలసిన రుసుం రూ.
1.	తిరుపతి-తిరుచానూరు తిరుగు ప్రైవేటు బస్సులకు 1కి రోజుకి 1కి	100-00
2.	టూరిస్టు బస్సులకు, మెటాడోరు వ్యాను రోజు 1కి	100-00
3.	శ్రీ శ్రీనివాసా మాక్సీ క్యాబ్ వ్యాన్ ఓనర్స్ వెల్‌ఫేర్ అసోషియేషన్ లైసెన్సు పొందిన వారి వద్ద నుండి మాత్రం మెటాడోరు వ్యాను రోజు 1 కి	70-00
4.	క్వాలీస్, సుమో, ట్రాక్స్, కారు మొదలగు వాహనములకు 1 రోజు 1కి	60-00
5.	జీపు, ట్రాక్టర్ మొదలగు వాహనములకు 1 రోజు 1కి	50-00
6.	ఆటోవాహనములకు 1 రోజు 1కి	5-00

గమనిక : బస్టాండు ప్రస్తుతము ఉన్న రీతిలోనే ఫీజులు వసూలు చేసుకొనవలెను. అదనముగా బస్టాండునకు ఎటువంటి సదుపాయములు కల్పించబడవు. ముఖ్య గమనిక: వేలపు నిబంధనలు వరుస నెం.1 నుండి 35 వరకు కార్యాలయపు పనివేళల యందు వచ్చి తెలుసుకొనవచ్చును.

కె.రామచంద్రారెడ్డి, సర్పంచ్ తిరుచానూరు గ్రామపంచాయితీ	ఆర్. మాధురి, విస్తరణాధికారి (పం.రా. & గ్రా.అ) తిరుపతి గ్రామీణ మండలం & పంచాయితీ కార్యదర్శి (పూ.అ.భా), తిరుచానూరు గ్రామపంచాయితీ







గాయపడిన హంపయ్య, గోవిందరాజు

కూర్చునే స్థలం కోసం.. కొట్టుకున్నారు

తిరుమల సీఆర్వో వద్ద గదుల కోసం వేచివున్న భక్తులు కొట్టుకున్నారు. కూర్చునే స్థలం విషయంలో కర్నాటక, తమిళనాడుకు లకు చెందిన రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తమిళనాడులోని కోయంబత్తురుకు చెందిన కార్తీకేయ గాజు బాటిల్‌తో దాడి చేయడంతో కర్ణాటక లోని బళ్లారికి చెందిన గోవిందరాజు, హంపయ్య గాయపడ్డారు. వీరిని స్థానిక అశ్విని ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. ఆ తర్వాత ఆ రెండు కుటుంబాలు రాజీపడినట్టు తెలిసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో మనో

సినీగాయకుడు మనో గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'ఎన్నిసార్లు చూసిన స్వామివారి రూపాన్ని మర్చిపో తుంటాం. భక్తులను మళ్లీ మళ్లీ రప్పించుకునే గొప్ప క్షేత్రం తిరుమల' అని అన్నారు. త్వరలో ఉగాది రానుందంటూ, ఈ నూతన తెలుగు సంవత్సరాదిలో కళాకారులందరి కష్టాలు తొల గిపోయి అద్భుత విజయాలు సాధించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి




ఏటీసీ దాకా క్యూలైన్

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.97 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,388
తలనీలాలు సమర్పించినవారు: 26,145



■ నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం






అరణ్య రోదన

- అంతరించిపోతున్న అడవులు
- పర్యావరణానికి పెను ప్రమాదం
- జనావాసంలోకి వన్యప్రాణులు

పర్యావరణ సమతుల్యానికి దోహదపడే అడవులు రాన్రానూ చిక్కిపోతున్నాయి. దురాక్రమణదారుల బారిన పడి తరిగిపోతున్నాయి. జీవవైవిధ్యానికి బాటలు వేసే వనాలు అంతరించిపోతున్నాయి. జనం చొచ్చుకు వస్తుంటే ఉండటానికి చోటు లేక జంతువులు జనారణ్యం బాటపడుతున్నాయి. కాలక్రమేణా అటవీ విస్తీర్ణం కుచించుకుపోవడంతో పర్యావరణానికి దుష్ఫలితాలు ఎదురవుతున్నాయి. ఇది భవిష్యత్‌లో మరింత ప్రాణ సంకటంగా మారుతుందని పర్యావరణ హితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- మంగళం,ఆంధ్రజ్యోతి





అటవీ విస్తీర్ణం ఏటేటా తగ్గిపోతోంది. అటవీశాఖ తాజా విడుదల చేసిన నివేదిక ప్రకారం జిల్లాలో 8,692.82 చదరపు కిలోమీటర్ల అటవీప్రాంతం ఉంది. ఇందులో దట్టమైనది 6.38 చదరపు కిలోమీటర్లు మాత్రమే. మధ్యస్థ దట్టమైన అడవి 888.26 చదరపు కిలోమీటర్లు. బహిరంగ అడవి 1,209.39 చదరపు కిలోమీటర్లు ఉంది. మిగిలిన అటవీప్రాంతం వివిధ సార్ధ ప్రయోజనాలతో తరిగిపోతోంది.

వన్యప్రాణులు జనావాసాల బాట

జిల్లా పరిధిలో శేషాచల కొండలు, వెలిగొండ అడవులు జీవవైవిధ్యానికి నిలయాలు. ఈ అడవుల్లో చిరుతలు, ఏనుగులు, ఎలుగుబండ్లు, దుప్పులు, అడవి కుక్కలు, అడవి పందులు, జాకల్స్, హనీ బ్యాగ్జర్, చుక్కల దుప్పులు, జింకలు, అరుదైన బంగారుబల్లి, పునుగుపిల్లి, దేవాంగపల్లి వంటి వన్యప్రాణులు ఆవాసముంటున్నాయి. అరుదైన ఎర్రచందనం, పెర్రిత, సాంబ్రాణి వంటి చెట్లతో పాటు మోగీ, కరక, నారేపి వృక్షాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. పక్షులు సీతాకోక చిలుకలు, పాములు, ఇతర కీటకాలు అడవినీడన నిశ్చింతగా బతుకుతున్నాయి. అడవులు కాస్తా క్రమేపి తరిగిపోవడంతో వన్యప్రాణులు గత్యంతరం లేక ఆహారం, నీటి కోసం జనావాసాల్లోకి రాకతప్పడంలేదు. .



ప్రకృతి సమతుల్యానికి భంగం

అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం పెనుప్రమాదంగా తయారవుతోంది. సమతుల్యత దెబ్బతిని పర్యావరణానికే ముప్పుగా పరిణమిస్తోంది. వృక్షాల సంఖ్య తగ్గి అడవి చిన్నబోతుండటంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే జనం అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారంటే అడవుల ప్రభావమే.ప్రకృతి సమతుల్యానికి విఘాతమేర్పడి వర్షాలూ తగ్గిపోతున్నాయని పర్యావరణ నిపుణులు ఆవేద న చెందుతున్నారు. అడవుల సంరక్షణ తక్షణ పరిష్కా రమని వీరంతా తలపోస్తున్నారు.

అభివృద్ధి పేరిట వేటు

తమ అవసరాల కోసం జనం అడవులను ఆక్రమించడం పరిపాటిగా మారింది. రోడ్లు, భవన నిర్మాణాలు, డ్యాములు, గనుల తవ్వకాల కోసమే కాదు అవసరమైన కలప కోసం అడవులపై గొడ్డలి వేటు పడుతోంది. ఈ పరిణామమే ఇపుడు మానవ మనుగడకు సవాలుగా మారింది. శేషాచల కొండల్లో శ్రీగంధం, ఎర్రచందనం వృక్షాలను అడ్డు ఆపులేకుండా నరికేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. తిరుమల కొండల్లోని శ్రీగంధం వృక్షాలు కనుమరుగయ్యాయి. ఆ జాబితాలోకి ఎర్రచందనంతో పాటు అరుదైన జంతువులు చేరిపోనున్నాయి. ఇప్పటికైనా అడవులు అంతరించి పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

హతుడు ఎవరు?

- తిరుచానూరు పరిధిలో మృతదేహం
- ఆనవాళ్లు గుర్తుపట్టకుండా యాసిడ్ పోసి కాల్చిన దుండగులు
- స్టేషన్ల వారీగా మిస్సింగ్ కేసులపై పోలీసుల ఆరా



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆనవాళ్లు గుర్తుపట్టకుండా యాసిడ్ పోసి కాల్చారు. ఇలా గుర్తు పట్టని స్థితిలో 30-35 ఏళ్ల వ్యక్తి మృతదేహం తిరుచానూరు పరిధిలోని 150 అడుగుల బైపాస్ రోడ్డు సమీపంలో పడుంది. ఇతడు ఏ ప్రాంతం వాడో తెలియని పరిస్థితి. ఎక్కడో హతమార్చి.. ఇక్కడ పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పూతలపట్టు-నాయుడుపేట బైపాస్ రోడ్డు సమీపంలో మృతదేహం ఉన్నట్లు గురువారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించి సీఐకి సమాచారం ఇచ్చారు. మరోవైపు ఎస్పీ హర్షవర్ధనరాజు, పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చామన ఛాయ కలిగిన ఆ వ్యక్తి ఎత్తు సుమారు ఐదు అడుగులు ఉండొచ్చు. ఎలిఫెంట్ కలర్ ప్యాంటు, మిల్క్ కలర్ వైట్ పైన పూలగుర్తులున్న చొక్కా ఉంది. బుధవారం అర్ధరాత్రిపైన ఇక్కడ మృతదేహాన్ని పడేసి ఉంటారని అంచనా. హతుడు ఎవరనే కోణంలో విచారిస్తున్నారు. దీనికిగాను మృతుడి ఫొటోలను అన్ని సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. అన్ని పోలీసు స్టేషన్లకు పంపారు. ఈ మిస్టరీ హత్యను ఛేదించి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. దీంతో పోలీసులు భిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జరిగిన ఘటనపై స్థానికంగా అందుబాటులో వున్న సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణులైన పోలీసు బృందాలను నియమించారు. ఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి. హత్యపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి కీలకమైన సీసీ టీవీ ఫుటేజీ లభ్యమైనట్లు సమాచారం.

కూలీలను ఢీకొన్న కారు

- వృద్ధురాలి మృతి.. నలుగురికి గాయాలు



లారీని ఢీకొన్న కారు - ప్రమాదంలో మృతి చెందిన పద్దాల రత్నమ్మ

వెంకటగిరిటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వర్ధనపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీలను కారు ఢీకొన్న సంఘటన గురువారం చోటుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వెంకటగిరి - గూడూరురోడ్డులో వర్ధనపల్లి వద్ద పద్దాల రత్నమ్మ (60), ఆమె కుమారుడు వెంకటకృష్ణయ్య, అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ధాన్యం కాటా వేసి లారీలోకి ఎక్కిస్తున్నారు. ఇదే సమయంలో నెల్లూరుకు చెందిన శివకుమార్,చిగి కళ్యాణ్‌రెడ్డి వారాంతపు తండల్ వసూలు కోసం కారులో వెంకటగిరికి వస్తుండగా, కారు అదుపుతప్పి కాటా వేస్తున్న కూలీలపైకి దూసుకెళ్లి ముందు ఉన్న ధాన్యం లోడ్ లారీని వెనుకవైపున ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాటా వేస్తున్న పద్దాల రత్నమ్మ, వెంకటకృష్ణయ్య, వెంకటేశ్వర్లుతో పాటు కారులో ఉన్న శివకుమార్, కళ్యాణ్‌రెడ్డి గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ పద్దాల రత్నమ్మ మృతి చెందింది. వెంకటకృష్ణయ్యవెంకటేశ్వర్లుకు స్వల్పగాయాలు కావడంతో ప్రథమ చికిత్స చేశారు.శివకుమార్, కళ్యాణ్‌రెడ్డిని నెల్లూరులోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.



తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో గురువారం జరిగిన స్నాతకోత్సవంలో ఛాన్సలర్ గోపాలస్వామి, వీసీ కృష్ణమూర్తి నుంచి బంగారు పతకాలు అందుకుంటున్న విద్యార్థులు



పీహెచ్‌డీ పట్టాదారులు

విద్యుదాఘాతంతో రైతు మృతి



గంగయ్య (ఫైల్ ఫొటో)

కేవీబీపురం, మార్చి 20(ఆంధ్ర జ్యోతి): మండలంలోని దిగువ పూడి గ్రామానికి చెందిన గంగయ్య(44) బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో తన పొలంలోనే మరణించాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు ..గంగయ్య బుధవారం రాత్రి 10గంటల సమయంలో ఇంటి వద్ద భోజనం చేసి తమ పొలంలో సాగుచేసిన శెనగ, పుచ్చ పంటలకు కావలి కాయడానికి వెళ్లాడు. కొన్ని రోజులుగా పందుల బెడద ఎక్కువగా ఉండటంతో పొలం చుట్టూ విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇస్తుండగా వైరు జారి కాలి పడింది. దీంతో షాక్‌కు గురై స్పృహ కోల్పోయాడు. పక్క పొలంలో తన సొంత అల్లుడు, అన్న కుమారుడు కావలి ఉన్నారు. గంగయ్య కేకలు విని వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అంబులెన్స్‌లో శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య దేశమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేశారు. కాగా గంగయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

సూళ్లూరుపేట,మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు గ్రామానికి చెందిన కొమరం నారాయణస్వామి ఇంటిపైకెళ్లి దూషించిన కేసులో ఐదుగురిపై గురువారం సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.బాధితుడి ఫిర్యాదు మేరకు అక్కరపాక మణికంఠ, పాలూరు రవి, లీలా మోహన్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ



విద్యార్థినులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న డిప్యూటీ ఈవో సనత్‌కుమార్

గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు స్థానిక డిప్యూటీ ఈవో కార్యాలయంలో గురువారం డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మాండలేస్ కంపెనీ సహకారంతో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలకు చెందిన 34 మంది విద్యార్థులు జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వీరిని మాండలేస్ కంపెనీ ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్‌లో ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరగనున్న పోటీలలో ఆడించేందుకు తీసుకువెళుతున్నారన్నారు. విద్యార్థులు ఈ పోటీల్లో ప్రతిభచాటి పాఠశాలలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిలివేటి కంటికి అభివృద్ధి కనబడటం లేదా..?

● మాజీ ఎంపీ నెలవల, మాజీ మంత్రి పరసా విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం, పరసా రత్నం, పక్కనే టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, పెరుమాళ్, రమేష్ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కంటికి కనబడటం లేదా అంటూ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నెలవలతో పాటు మాజీ మంత్రి పరసా వెంకటరత్నం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం హామీలు నెరవేర్చలేదని సంజీవయ్య చెప్పడం విడ్డూరంగా ఉందని, కళ్లతో చూస్తే అభివృద్ధి పనులు, హామీలు నెరవేర్చిన విషయం తెలుస్తుందన్నారు. ఉనికిని కాపాడుకొనేందుకు ఆయన అప్పుడప్పుడు నెల్లూరు నుంచి వచ్చి వెళుతుంటారని విమర్శించారు. తమ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు వైసీపీకి లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి పరసా మాట్లాడుతూ ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. 10 నెలలకే సీసీ రోడ్లు, రోడ్ల మరమ్మతులు చేసిన ఘనత టీడీపీదేనని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీల్లో ఇప్పటికే ఉచిత గ్యాస్, ఫించన్ల పెంపు నెరవేర్చారని.. మే మాసంలో తల్లికి వందనం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు హామీని త్వరలోనే నెరవేర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కొక్కు శంకరయ్య, చిట్టేటి పెరుమాల్, గాడి నారాయణరెడ్డి, వేనాటి మురళిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌ల సస్పెన్షన్



వివరాలను తెలుసుకుంటున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

వాకాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మరణించిన వారికి, గ్రామంలో లేనివారికి, చదువుకుంటున్న వారికి మస్టర్లు వేసి అక్రమాలకు పాల్పడ్డ కల్లూరు, ముట్టెంబాక ఫీల్డ్ అసిస్టెంట్‌లు శ్రీనివాసులు, పరంధామయ్యలను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి రూ.8.28 కోట్ల రూపాయల ఉపాధిహామి పనులు మండలంలో జరిగాయన్నారు. ముట్టెంబాక ఫీల్డ్ అసిస్టెంట్ పరంధామయ్య, పలువురు వేతనదారుల పేరిట బినామీ మస్టర్లు వేయడంతో విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. కల్లూరు ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు పనిచేయని వారి పేర్లతోపాటు చనిపోయిన వారిపేర్లతో మస్టర్లు వేసి నిధులు డ్రాచేయడంతో సస్పెండ్ చేసినట్లు చెప్పారు. వాకాడు ఫీల్డ్ అసిస్టెంట్ పలు అవకతవకలకు పాల్పడుతున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీవో విజయమ్మ పనితీరులో నిర్లక్ష్యం వహించడంతో మందలించారు. కొన్ని పంచాయతీలలో పనులు జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, పురుషోత్తమరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గేట్‌లో ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం గేట్ పరీక్షల్లో ప్రతిభా పాటవాలు చూపిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు అభినందించారు. దేశంలోని ఐఐటీలు పలు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన గేట్ 2025 ఫలితాల్లో ఎన్‌బీకేఆర్ మెకానికల్ విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటినట్లు డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. మెకానికల్ 4వ సంవత్సరం చదువుతున్న వడ్డపూడి దినేష్, చింతమాను మహేష్‌లు ప్రొడక్షన్ ఇంజనీరింగ్ పేపర్‌లో జాతీయస్థాయిలో 309, 597 ర్యాంక్‌లను, గేట్ ఇంజనీరింగ్ సైన్స్ పేపర్‌లో అశోక్ జాతీయస్థాయిలో 939 ర్యాంక్‌ను కైవసం చేసుకున్నట్లు విజయకుమార్‌రెడ్డి తెలిపారు. గేట్ మెకానికల్ ఇంజనీరింగ్ పేపర్‌లో మహేష్, అశోక్ 506, 6,790 ర్యాంక్‌లను సాధించారు. దీంతో ఆయా విద్యార్థులను డైరెక్టర్‌తోపాటు పలువురు విభాగాధిపతులు అభినందించారు.

విద్యతోపాటు ఆటలకూ ప్రాధాన్యమివ్వాలి



చిన్నారులకు ఆట వస్తువులను అందజేస్తున్న డాక్టర్ రోహిణి

గూడూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు ఆటలకు కూడా ప్రాధాన్యమివ్వాలని డాక్టర్ రోహిణి అన్నారు. స్థానిక తూర్పు వీధిలోని అంగన్‌వాడీ పాఠశాలలో గురువారం లాఫింగ్ డే సందర్భంగా చిన్నారులకు ఆటవస్తువులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచి అంగన్‌వాడీ పాఠశాలలలో పిల్లలకు ఆట, పాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. దీంతో చిన్నారుల్లో మానసిక ఉల్లాసం పెరిగి చదువుల పట్ల ఆసక్తిని పెంపొందించుకుంటారన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మెహబూబి, డాక్టర్ తనూజ, జీవని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ధన్యవాదాలు

గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో, శాసనమండలిలో ప్రవేశపెట్టినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిసింద్రి గురువారం తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలుపరిచేందుకు చర్యలు చేపడుతున్న సీఎంకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు

దొరవారిసత్రం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం ఉదయం రైలు ప్రమాదంలో గుర్తు తెలియని సుమారు 60 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. రైల్వేస్టేషన్‌కు ఉత్తరం వైపు తీవ్ర గాయాలతో పడి ఉండగా, స్థానిక రైల్వే సిబ్బంది గుర్తించారు. వెంటనే 108 అంబులెన్స్ సాయంతో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. మృతుడిని చికిత్స కోసం తరలించే సమయంలో తనది గొల్లపాళెం అని, ఇద్దరు ఆడపిల్లలు అని చెప్పి స్పృహ కోల్పోయినట్లు రైల్వేసిబ్బంది తెలిపారు. సూళ్లూరుపేట రైల్వే ఎస్‌ఐ మాలకొండయ్య, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించగా, బుధవారం వెంకటగిరి నుంచి నాయుడుపేటకు బస్సులో ప్రయాణించిన బస్సు టిక్కెట్, అలాగే వెంకటగిరి పట్టణంలోని శ్రీస్వామి మెడికల్ చీటి ఉన్నట్లు గుర్తించారు. దాంతో మృతుడు వెంకటగిరి పరిసర ప్రాంత వాసి అయి ఉండవచ్చని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యం

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోన్న తనూజ అనే విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్ కుమార్ గురువారం తెలిపారు. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొమ్మలపూడికి చెందిన తనూజ విద్యానగర్‌లో ఇంజనీరింగ్ చదువుతోంది. సెలవులకు వచ్చి ఈ నెల 17వ తేదీన ఇంటి నుంచి కళాశాలకు వచ్చింది. అదే రోజు నుంచి విద్యార్థిని కనిపించకుండా పోయింది. దీంతో తల్లిదండ్రులు అన్ని చోట్లా విచారించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని కీమాన్ మృతి



మృతిచెందిన బాలకృష్ణ

గూడూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు ఢీకొని రైల్వే కీమాన్ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగుచూసింది. రైల్వే జీఆర్ పోలీసుల కథనం మేరకు... స్థానిక రెండోపట్టణ పరిధిలోని ఎస్ఆర్‌పి టాకీస్ సమీపంలో నివాసముంటున్న బాలకృష్ణ (40)ను బుధవారం గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వేస్టేషన్‌కు ఉత్తరం వైపు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతి చెందాడని తెలిపారు. గురువారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ల బదిలీ

కోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కోటలోని జాతీయ ఉపాధి హామి పథకం కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్‌లు కౌన్సెలింగ్‌లో బదిలీ అయ్యారు. ఇక్కడ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ దొరవారిసత్రంకు, శాంతి చిల్లకూరుకు, కంప్యూటర్ ఆపరేటర్ సునీత నాయుడుపేట ఉపాధి హామి కార్యాలయాలకు బదిలీ అయినట్లు గురువారం ఆయా సిబ్బంది తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు జనసేన



బాలసదన్‌లో కేక్ కట్ చేస్తున్న జంపాల ప్రకాష్

వెంకటగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జనసేన క్రమశిక్షణ గల పార్టీ అని, కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని వెంకటగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త జంపాల ప్రకాష్ అన్నారు. ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని స్థానిక బాలసదన్‌లో గురువారం జంపాల ప్రకాష్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పిల్లలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాధమ్మ, చిరంజీవులు, మధు, వెంకటరమణ, టెంకాయిల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ వివరాలు సరి చూసుకోవాలి

పెళ్లకూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ క్రాప్ వివరాలు నమోదు చేయించుకున్న రైతుల వివరాలను ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని పెళ్లకూరు, చిల్లకూరు, నెలబల్లి, పుల్లూరు, కలవకూరు, పాలచ్చూరు, చావాలి, శిరసనంబేడు, బంగారంపేట, చెంబేడు, పునబాక, తాళ్వాయిపాడు, కానూరు రైతు సేవా కేంద్రాల్లో వివరాలను ప్రదర్శించామని, రైతులంతా ఈ జాబితాలోని వివరాలు చూసుకుని ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలన్నారు. వీఏఏలు చందు, దినేష్ తదితరులు ఉన్నారు.

రేపు జాబ్‌మేళా

గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం గురువారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పలు బహుళజాతి కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు చెప్పారు. వివరాలకు 97005 61225 నంబరును సంప్రదించాలన్నారు.

గ్రీవెన్స్‌డే నిర్వహణలో మార్పులు

చిట్టమూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రంగా ఉండడం వలన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో మార్పులు చేసినట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డే కార్యక్రమం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ సమయంలోనే అర్జీలను సమర్పించుకోవాలని కోరారు.

పాఠశాలలో సరస్వతీపూజ

వాకాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్టెంబాక ప్రభుత్వ పాఠశాలలో గురువారం సరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సరస్వతీదేవి విగ్రహాన్ని విశేష పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుమూరు రమణయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, లక్ష్మీ, సర్పంచ్ అనిల్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ కమల, రాజయ్య, శేషయ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నత్తనడకన మినీ గోకులాలు

● కరువైన అధికారుల పర్యవేక్షణ



కోట మండలం గూడలిలో అసంపూర్తిగా ఉన్న మినీ గోకులం

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పశువుల సంరక్షణలో భాగంగా రైతులకు తోడ్పాటుగా గ్రామాల్లో రైతులనే లబ్ధిదారులుగా చేస్తూ ప్రభుత్వం మినీ గోకులాల (పశువుల షెడ్లు)ను మంజూరు చేసింది. అయితే అవగాహన లోపం, అధికారుల పర్యవేక్షణ కొరతతో ఆయా గోకులాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కోట మండలంలోని 21 పంచాయతీలకు సంబంధించి 54 మినీ గోకులాల షెడ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి ఉపాధిహామి పథకం నిధులు మంజూరు చేసి, నిర్మాణంలో రైతులను భాగస్వాములుగా చేసింది. ఒక్కొక్క షెడ్ నిర్మాణానికి రూ.2.30 లక్షలు మంజూరు చేసింది. రైతు తన పెరటిలో ఈ షెడ్ నిర్మించుకుంటే ఉపాధిహామి పథకం అధికారులు పర్యవేక్షించి బిల్లులు చేయాల్సి ఉంది. అయితే 54 మినీ గోకులాలకు సంబంధించి కేవలం 44 గోకులాలు మాత్రమే నిర్మాణంలో ఉండగా, వీటిలో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. మరో 10 గోకులాల నిర్మాణం ప్రారంభం కాలేదు. రైతులకు ఈ మినీ గోకులాలపై ఉపాధిహామి అధికారులు అవగాహన కల్పించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆశాఖలోని కొంత మంది అధికారులు నిర్మాణాలు జరగని మినీ గోకులాలకు కూడా జరిగినట్లుగా రికార్డులు సృష్టించి, బిల్లులు చేయించేందుకు ఆశాఖలోని టెక్నికల్ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. కోట మండలంలో జరుగుతున్న మినీ గోకులాల నిర్మాణాలపై ఉన్నతాధికారులు నిఘా పెడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మండల ప్రజలు కోరుతున్నారు.

తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ దేశాల్లో చాటడమే లక్ష్యం

● ప్రవాస భారతీయురాలు, రచయిత్రి బీజీ షిరిడీ



అమెరికాలో తెలుగు సభల్లో పాటలు పాడుతున్న బీజీ షిరిడీ

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అచ్చమైన తెలుగు సాహిత్యాన్ని, సాంప్రదాయాలను పాటలు, సంగీత రూపంలో పాశ్చాత్య దేశాల్లో చాటిచెప్పడమే తన లక్ష్యమని ప్రవాస భారతీయురాలు, తెలుగుపాటల రచయిత, సంగీత దర్శకురాలు బీజీ షిరిడీ తెలిపారు. కోట పట్టణానికి చెందిన బీజీ షిరిడీ గత కొన్నేళ్లుగా అమెరికాలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. ఆమె రెండు రోజుల క్రితం అమెరికా నుంచి స్వగ్రామమైన కోటకు వచ్చారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సాహిత్య విలువలతో, సరికొత్త సంగీతాన్ని అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. చిన్నతనం నుంచే సంగీతంతోపాటు చిత్రలేఖనం, ఫొటోగ్రఫీలో అనుభవం ఉన్నట్లు తెలిపారు. కోటకు అల్లుడైన ప్రముఖ సంగీత దర్శకుడు కాలూరి రాజేశ్వరరావు కుమారుడు కోటి స్ఫూర్తితో అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉంటూనే తెలుగులో పాటలు రాయడం, అమెరికాలోని తెలుగుసభల్లో తెలుగుబాణీలో పాటలు పాడుతూ వచ్చారు. తల్లిదండ్రులు నారాయణస్వామి-అరుణలు రిటైర్డ్ ఉపాధ్యాయులు అని తెలిపారు. జాతీయ సాంస్కృతిక శిబిరంలో ఎస్వీ యూనివర్శిటీ బృందంలో గాయనిగా, కీబోర్డు ప్లేయర్‌గా ప్రాతినిధ్యం వహించానన్నారు. కౌగిలి అనే తెలుగు సినిమాకు పాటలు రాసి స్వయంగా బాణీలు కుదిర్చానన్నారు. తెలుగుచిత్ర పరిశ్రమలో పాటలు రాయడం, పాడటం, సంగీతం అందించడానికి మరి కొద్దిరోజుల్లో ప్రముఖ గాయని సునీతతో కలసి రంగ ప్రవేశం చేయనున్నట్లు బీజీ షిరిడీ తెలిపారు.

హజరత్ అమీర్‌షావలి దర్గా ఉరుసు ఏర్పాట్లు ప్రారంభం



నాయుడుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట దర్గావీధిలోని హజరత్ అమీర్‌షావలి దర్గా 74వ ఉరుసును 9 సంవత్సరాల అనంతరం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం ఉరుసు ఏర్పాట్లను ప్రారంభించారు. నాయుడుపేటలో గత 65 సంవత్సరాలుగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ ఉరుసు గంధోత్సవం వైభవంగా జరిగేది. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి, రాష్ట్రాల నుంచి కూడా స్థానిక బంధువుల ద్వారా వచ్చేవారు. కొన్ని సంవత్సరాల క్రితం దర్గా వ్యవస్థాపక కమిటీ, వక్ఫ్‌బోర్డు ఏర్పాటు చేసిన కమిటీల మధ్య విభేదాలు తలెత్తడంతో ఉరుసును నిలిపివేశారు. టీడీపీ ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, దర్గా ఉరుసు చైర్మన్ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యుల చర్చల అనంతరం ఏప్రిల్ 3వ తేదీన శ్రీవారి గంధం, 4న సినిమా పాటకచేరి, 5న అన్నదానం, జబర్దస్త్ టీమ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పూలే విగ్రహం వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ నేతలు

నాయుడుపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రబాయి పూలే విగ్రహాల వద్ద ప్రధాన డ్రైనేజీ ధ్వంసం కావడంతో ఆ ప్రాంతంలో పారిశుధ్య సమస్య నెలకొందని సీమాంధ్ర బీసీ సంఘ సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షుడు జువ్వలపాటి మస్తాన్ అన్నారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ ఫజులుల్లాకు బీసీ సంఘ నాయకులతో కలసి వినతి పత్రం అందజేశారు. పూలే విగ్రహం వద్ద పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. బీసీ నాయకులు రామయ్య, శివ, ఆవుల వినోద్, ఎస్‌కె షరీఫ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రతినిధులు

సూళ్లూరుపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. మాంబట్టు పారిశ్రామిక వాడలోని టాటాకెమికల్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు నైపుణ్య శిక్షణ అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ నైపుణ్యాలు సాధిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీసీఎస్ఆర్‌డీ ప్రతినిధులు సతీష్, శ్రావణ్, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఉషార్ రాణి తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళలకు దుస్తుల పంపిణీ



గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పేదలకు సాయం చేయడమే రంజాన్ మాస ప్రత్యేకత అని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ రియాజ్ అహ్మద్ అన్నారు. గురువారం స్థానిక దర్గా సమీపంలోని ఆయన నివాసం వద్ద తల్లి ఖాదర్‌ఉన్నీసాబేగం జ్ఞాపకార్థం సందర్భంగా పేద ముస్లిం మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హఫీజ్ అహ్మద్, నూర్, చాన్‌బాషా, మగ్దూం, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

చిట్టమూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు తహసీల్దార్ సతీష్‌కుమార్‌ను రెవెన్యూ అసోసియేషన్ జేఏసీ జిల్లా సెక్రటరీ పెళ్లూరు గోపీనాథ్ రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. ఈయనతో పాటు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్‌కుమార్, మండల సర్వేయర్ వెంకటేష్ ఉన్నారు.

చెందోడులో విద్యుత్ అదాలత్



విద్యుత్ సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం గూడూరు డివిజన్ విద్యుత్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరిగింది. ఈ అదాలత్‌కు రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల విద్యుత్ వినియోగదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఆయా మండలాల్లో విద్యుత్ సమస్యలపై 15 మంది రైతులు వినతిపత్రాలు అందించారు. కొన్ని సమస్యలను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని తర్వాత పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వాడకంపై రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ చిన్నయ్య, ఆయా మండలాల ఏఈలు, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.నారాయణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గురుకులంలో ఆయా తరగతుల్లో ప్రవేశపరీక్షలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరాల్లో ఏదైనా పాఠశాలలో 4వ తరగతి, పదో తరగతి చదివిన విద్యార్థులకు పైతరగతుల ప్రవేశాలకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

దోమల నియంత్రణకు చర్యలు

సూళ్లూరుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొన్నారు. గురువారం పట్టణంలోని మురుగుకాలువల్లో దోమల మందును పిచికారీ చేయించారు. కమిషనర్ చిన్నయ్య ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీలు రాత్రి ఫాగింగ్ చేసి, పగటిపూట దోమల మందును పిచికారీ చేయించారు. కాలువల్లో పలుచోట్ల మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మలేరియా ఆయిల్ స్ప్రే చేశారు. దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

షాపుల వద్ద మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలి

సూళ్లూరుపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల వద్ద మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గురువారం సూళ్లూరుపేట ఎక్సైజ్‌పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. తడ - శ్రీకాళహస్తి రోడ్డులో మద్యం దుకాణాల పక్కనే మద్యం సేవించేందుకు బారుల్లా ఏర్పాట్లు చేశారని, వాటిని వెంటనే తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిశీలించి చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ హామీ ఇచ్చారు. సీపీఐ నాయకులు నాగేంద్రబాలు, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సూళ్లూరుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శ్రీహరికోట రోడ్డులో ఉన్న అంబేడ్కర్ గురుకులంలో గురువారం రాత్రి ఆరో తరగతి చదువుతున్న చందన అనే విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గురుకులంలో పరీక్షల రాసే విషయంలో తోటి విద్యార్థినితో చిన్నపాటి వివాదం తలెత్తడంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని చేతికి ఉన్న గాజులు పగలగొట్టి గాజుల పొడిని మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తోటి విద్యార్థినులు గురుకులం సిబ్బంది దృష్టికి తీసుకెళ్లడంతో ఆ విద్యార్థినిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో గూడూరుకు తరలించారు.

తీర ప్రాంతాల భద్రత కోసమే సీఐఎస్‌ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ

● సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్



సూళ్లూరుపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా తీర ప్రాంతాల భద్రత కోసం సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్ర సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సీఐఎస్ఎఫ్ 56వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా దేశంలో పశ్చిమ, తూర్పు తీరాలను కలుపుతూ 6,553 కి.మీ మేర ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సురక్షిత తీరం అనే నినాదంతో తీర ప్రాంత సమాజాలను, విద్యార్థులు, ఇతరులకు అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆయుధాలు, పేలుడు పదార్థాల వంటి ముప్పు గురించి యువతకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. మన రాష్ట్రంలో వైజాగ్‌లో ప్రారంభమైన ఈ ర్యాలీ 21న చీరాలకు చేరుకుంటుందని, 22న ఒంగోలు, 23న నెల్లూరుకు చేరి అదే రోజు రాత్రి నాయుడుపేటకు చేరుకుంటుందని చెప్పారు. 24న ఉదయం నాయుడుపేటలో బయలుదేరి సూళ్లూరుపేటకు చేరుకొని అక్కంపేట వద్దనున్న జైన్ టెంపుల్‌లో రాష్ట్రంలో ర్యాలీ ముగుస్తుందని వివరించారు. అక్కడ నుంచి అదే రోజు తమిళనాడు రాష్ట్రంలోకి చేరుకొంటుందని అన్నారు. చీరాల నుంచి తమిళనాడు సరిహద్దు వెళ్లేవరకు షార్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ ఆధ్వర్యంలో ర్యాలీ జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన రూట్‌మ్యాప్ ఏర్పాట్లను సిద్ధం చేసుకొంటున్నట్లు ఆయన తెలిపారు.

జనసేన అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలోనే ఈ వారమూ అన్నదానం చేశారు. పలువురు నేతలు పవన్ కల్యాణ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత మాస్కులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, విశ్రాంత తహసీల్దారు చంద్రశేఖర్, పేట చిరంజీవి, వెంకటరమణయాదవ్, దినేష్, శీను, మునికుమార్, వెంకటేష్, సాయి, చందు, మహేష్, దివాకర్, వీర మహిళలు కవిత, శారద, గాయత్రి, బత్తెమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

వనరాజా కోళ్ల పంపిణీ



దాణా పంపిణీ చేస్తున్న విశ్వవిద్యాలయ అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఊరందూరు హరిజనవాడలో గురువారం తిరుపతి వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అఖిల భారత భారత సమన్వయ కోళ్ల పరిశోధన ప్రాజెక్టులో భాగంగా 32మందికి వనరాజా కోళ్లను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 8 వనరాజా కోళ్లు, దాణా, మందులు, నీటి తొట్టి, పంజరంను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ వీర బ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య, కోళ్ల శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ షకీల, ప్రొఫెసర్ రాంబాబునాయక్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎన్వీ శ్రీకాంత్‌బాబు, ఊరందూరు డాక్టర్ ఊహ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి 'మీసేవ' అసోసియేషన్ కృతజ్ఞతలు



శ్రీకాళహస్తి, మార్చి 20(ఆంధ్ర జ్యోతి): మీసేవ ఆపరేటర్లను ఐటీ శాఖ లో చేరుస్తామని మంత్రి నారా లోకేశ్ చెప్పడంపై మీసేవ అసోసి యేషన్ తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం వారు ఆర్టీసీ బస్టాండు కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అలాగే సీఎం చంద్రబాబు, మంత్రి, లోకేశ్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. మీసేవ నిర్వాహకులు సూర్య, కిరణ్, శ్రావణ్, షామీర్, గురవయ్య, శ్యామ్, కవిత పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం భిక్షాటనతో నిరసన



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాల కోసం చేస్తున్న రిలే దీక్షల్లో భాగంగా గురువారం భిక్షాటనతో నిరసన చేపట్టారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శులు చారులత , జైభీమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీకాంత్, శ్రీకాళ హస్తి సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, టౌన్ సెక్రటరి గోపి, సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్రమశిక్షణకు స్కౌట్స్ అండ్ గైడ్స్ అవసరం



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల క్రమ శిక్షణకు స్కౌట్ అండ్ గైడ్స్ అవసర మని ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ కోసం ఉపాధ్యా యుడుని నియమించారు. విద్యార్థులను ఎంపిక చేసి వారికి యూనిఫామ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.50వేలు నిధులు మంజూరు చేసిందని వివరించారు.

శ్రీసిటీ కంపెనీలకు ప్రతిష్ఠాత్మక సీఐఐ అవార్డులు



అవార్డును స్వీకరిస్తున్న డానియెలీ ఇండియా ప్రతినిధులు

శ్రీసిటీ, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): శ్రీసిటీ లోని మూడు పరిశ్రమలకు 2024- సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డులు దక్కాయి. విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్లో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ మాధవరెడ్డి ప్రతాప్ ఈ అవార్డులు అందజేశారు. శ్రీసిటీకి చెందిన మాండలెజ్ ఇండియా, కెలాగ్స్, డానియెలీ కంపెనీలతో పాటు అదానీ పోర్ట్స్, రామ్‌కీ గ్రూప్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, కోరమాండల్ తదితర సంస్థలు కూడా ఈ పురస్కారాలను అందు కున్నాయి. ఇందులో మాండలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇండస్ట్రియల్ సేఫ్టీ లీడర్ షిప్ అవార్డు కింద ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ విభాగంలో గోల్డ్ అవార్డు దక్కింది. 2024 సంవత్సరానికి బెస్ట్ సేఫ్టీ పర్ఫార్మర్‌గా ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో గోల్డ్ అవార్డును కెల్లాగ్స్ అందుకుంది. డానియెలీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 'ఏ ఇండస్ట్రియల్ సేఫ్టీ లీడర్ షిప్ అవార్డు కింద ఇంజనీరింగ్ విభాగంలో గోల్డ్ అవార్డును అందుకుంది. విజేతలకు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఐఐ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ, ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ప్రముఖులు హాజరయ్యారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమయం మార్పు

వరదయ్యపాళెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి సోమవారం నిర్వహించ నున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమయంలో మార్పులు చేసినట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వేసవికాలం నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నేడు వాణిజ్య గదుల వేలం

వరదయ్యపాళెం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాణిజ్య సముదాయపు గదులను శుక్రవారం వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం జరి గిన వేలంలో 2, 3, 4, 11, 20, 21, 23, 25 గదులకు సంబంధించి ఎవరూ వేలం పాటలో పాల్గొనలేదని గుర్తుచేశారు. రెండవ విడతగా శుక్రవారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ పూజ చేశారు. తర్వాత అభిషేకం జరిపించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించు కున్నారు.

రంజాన్‌కు ఈద్గా సిద్ధం



శ్రీకాళహస్తి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ముస్లింలు రంజాన్ పండుగను ఎంతో పవిత్రంగా నిర్వహించు కుంటారు. రంజాన్ మాసం మొత్తం ఉపవాసం ఉండి చివరి రోజు ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తారు. అందులో భాగంగా పట్టణంలోని ఈదుల గుంట వద్ద గల ఈద్గాను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో సిద్ధం చేస్తున్నారు.

బహిరంగ మద్యపానం నేరం



శ్రీకాళహస్తి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి హెచ్చరించారు. పట్టణంలోని జయరామారావు వీధిలోని ప్రజలకు వైష్ణవ కోనేరు వద్ద గురువారం బహిరంగ మద్యపానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలో కొంతమంది మద్యం సేవిస్తున్నారని పోలీసులకు తెలిపారు. అనంతరం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ప్రాణాలు తీస్తున్న వ్యవసాయ చెక్‌పోస్టు

- ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులు మృతి
- భయంభయంగా విధులు

శ్రీకాళహస్తి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు అక్కడి సిబ్బంది ఉద్యోగుల ప్రాణాలను హరిస్తోంది. వాయువేగంతో వచ్చే వాహనాల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు.

వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు గతంలో తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం వద్ద పూతలపట్టు -నాయుడుపేట రహదారిపై ఉండేది. ఇక్కడ వాహనాలను నిలిపి తనిఖీలు చేసేవారు. ఇటీవల పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారి ఆరులేన్ల విస్తరణతో కొత్తగా ఏర్పడింది. దాంతో పాత చెక్‌పోస్టు ఉన్న రోడ్డు రహదారితో సంబంధం లేకుండాపోయింది. ఈ క్రమంలో ఆరు నెలల నుంచి తొట్టంబేడు మండలం పెద్దకన్నలి వద్ద జాతీయ రహదారికి ఉన్న డివైడర్ మధ్యలో చెక్‌పోస్టును తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. గోనెపట్టలతో అక్కడ చెక్‌పోస్టు పెట్టారు. ఆరులేన్ల జాతీయ రహదారి... దానికితోడు అక్కడే ఫ్లైఓవర్ కూడా ఉంది. పెద్దఎత్తున భారీ వాహనాలు నిత్యం వేగంగా ఇక్కడ రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి చోట సిబ్బంది విధులు నిర్వహిస్తూ వాహనాలను పర్యవేక్షించాల్సి ఉంది. రెప్పపాటులో వాహనాలు దూసుకెళుతుంటాయి. సిబ్బంది అక్కడే గంటల తరబడి పలుమార్లు రోడ్లను దాటాల్సి ఉంటుంది. కనీసం గది కూడా లేదు. ఎండకు ఎండుతూ ఆ పట్టల కిందే ఉక్కపోతతో, వాహనాల కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పెద్దకన్నలి వద్ద డివైడర్ మధ్యలో ఉన్న మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు

ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు ఉద్యోగులు

ఆరు నెలల క్రితం వెంకటేష్ అనే ఉద్యోగి ఇక్కడ విధులు నిర్వహిస్తుండగా సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. రక్షక్ పోలీసు సిబ్బందికి సాయం చేసేందుకు వారితో పాటు పోలీసు వాహనంలో ఘటనా స్థలానికి వెళ్లాడు. రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తుండగా ఓ గ్యాస్ లారీ పోలీసు వాహనాన్ని అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మార్కెట్ కమిటీ ఉద్యోగి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన మరవకముందే నెల రోజుల క్రితం మునీంద్ర అనే మరో మార్కెట్ కమిటీ ఉద్యోగి చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉండగా నెల్లూరు నుంచి బెంగళూరుకు వెళ్లే ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మునీంద్ర వారం రోజుల పాటు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరు నెలల వ్యవధిలో ఇప్పటికే ఇద్దరు చెక్‌పోస్టు ఉద్యోగులు ప్రాణాలు విడిచారు. డివైడర్ మధ్యలో కాకుండా వేరే చోట ఎక్కడైనా స్టాపింగ్ ఉండే చోట చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తే మంచిదని పలువురు పేర్కొంటున్నారు.

భజన టీచరమ్మకు కోలాటంతో చిన్నారుల నివాళి

పిచ్చాటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అంగన్వాడీ టీచరు, పండరి భజన టీచరమ్మ శ్రీవాణికి ఆమె వద్ద భజనలో శిక్షణ పొందిన చిన్నారులు కోలాటంతో నివాళులర్పిం చారు. శ్రీవాణి బుధవారం మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శ్రీవాణి వద్ద పండరి భజన, కోలాటం అభ్యసించిన విద్యార్థులు భజన డ్రెస్ కోడ్‌తో పిచ్చాటూరు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి గజమాలతో కోలాటం వేస్తూ తోపు వీధిలోని శ్రీవాణి ఇంటికి చేరుకున్నారు. అక్కడ ఆమెకు గజమాల వేసి అంజలి ఘటించారు. సహచర గురువులు, తల్లిదండ్రులు ఆమెకు నివాళులర్పించారు.

శ్రీవాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: సీపీఎం

అంగన్వాడీ కార్యకర్త శ్రీవాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం పిచ్చా టూరులో శ్రీవాణి అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్దన్, సీఐటీయూ నాయకులు మెలుగు రమేష్, నాగలాపురం నాగరాజు, వెంకటేష్, రామచంద్రారెడ్డి, మునిశంకర్, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వరి, ఇంద్రాణి, అంగన్వాడీ యూనియన్ నాయకులు కృష్ణవేణి కల్యాణి, పూర్ణమ్మ, భారతి, శ్రీదేవి, ప్రమీల నాగభూషణమ్మ, విజయ, శ్రీకాళహస్తి ప్రాజెక్టు నాయకురాలు రేవతి, రేణిగుంట ప్రాజెక్టు నాయకురాలు ధనమ్మ, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



పిచ్చాటూరులో కోలాటం వేస్తున్న చిన్నారులు

కరకంబాడి చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



రేణిగుంట, మార్చి 20, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కరకంబాడి చెరువులో గురువారం సాయంత్రం పద్మానగర్‌కు వెళ్లే దారి పక్కన ఉన్న ప్రైవేటు వెంచర్‌కి ఆనుకుని ఉన్న చెరువులో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు చెరువులో ఉన్న మృతదేహాన్ని అతి కష్టం మీద వెలికి తీశారు. మృతుడి వయసు (55) పైన ఉంటుంది. మృతదేహం కుళ్లిపోవడంతో గుర్తు పట్టని విధంగా తయారైంది. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జొమాటో డెలివరీ బాయ్స్‌పై దాడి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జొమాటో డెలివరీ బాయ్‌లపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన గురువారం భారతీ బస్టాండు వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ మహేష్ కథనం మేరకు.. ఇర్లానగర్‌కు చెందిన జశ్వంత్, శ్రీనివాసపురానికి చెందిన విష్ణు జొమాటో డెలివరీ బాయ్‌లుగా పనిచేస్తున్నారు. వీరు ఫుడ్ డెలివరీ కోసం బుధవారం కనకభూషణ లేఅవుట్‌కు వెళ్లారు. ఆ సమయంలో స్థానికంగా కొందరు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకుంటూ కేక్ కట్ చేస్తున్నారు. జొమాటో డెలివరీ బాయ్‌లను వారు పిలిచారు. వారు పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ఆగ్రహించిన సదరు యువకులు గురువారం ఉదయం భారతీ బస్టాండు వద్ద జశ్వంత్, విష్ణులపై దాడి చేశారు. స్థానికులు గమనించి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఐసీడీఎస్ అధికారుల చెంతకు శిశువు

తిరుపతి(వైద్యం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): బాలికకు పుట్టిన మగబిడ్డకు రుయాస్పత్రిలో 35 రోజులు చికిత్స అందించి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో గురువారం రుయా అధికారులు ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. చిత్తూరు జిల్లా పలమనేరు మండలానికి చెందిన బాలిక గర్భందాల్చి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గత నెల 15న చిత్తూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు. అప్పటికే బాలిక పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఫిబ్రవరి 16న రుయాస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ బాలిక మృతిచెందిన విషయం తెలిసిందే. బిడ్డను చిన్నపిల్లల విభాగంలో చికిత్స అందించారు. శిశువు కోలుకోవడంతో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి, సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, డీసీఎస్ ఆర్ఎంవో శ్రీనివాస్‌లు ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. ఏఆర్ఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.

గేట్‌లో సుజనకు 881 ర్యాంక్



పుత్తూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పుత్తూరుకు చెందిన సుజన గేట్ పరీక్షలలో 881 ర్యాంక్ సాధించింది. కుమార్తెకు మంచి ర్యాంక్ రావడం పట్ల తలిదండ్రులు ఆలూరు సుబ్రమణ్యం, పార్వతి సంతోషం వ్యక్తం చేశారు.

గేట్‌లో ప్రతిభ చూపిన పూజ



వరదయ్యపాళెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా గేట్ పరీక్షలో వరదయ్యపాళెంకు చెందిన కల్లూరు పూజ ప్రతిభ చూపి 911వ ర్యాంకు సాధించింది. ఈమె తండ్రి కల్లూరు యుగంధర్. రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, తదితరులు ఆ విద్యార్థిని అభినందించారు.

టిప్పర్ సీజ్



కేవీబీపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీజే కంపెనీకి చెందిన టిప్పర్ సరైన పత్రాలు లేకపోవడంతో పాటు మెటల్ శాండ్ నింపి అధిక లోడ్‌తో చెన్నైకు వెళుతుండగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు గురువారం సీజ్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

పుత్తూరు వార్తలు

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సబ్ స్టేషన్ల పరిధిలో సదస్సులు

వడమాలపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సబ్ స్టేషన్ల పరిధిలో 'విద్యుత్ సమస్యలు-పరిష్కారాలు' పేరుతో సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ సురేంద్రనాయుడు చెప్పారు. గురువారం మండలంలోని పాదిరేడులో గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 211 సబ్‌స్టేషన్ల పరిధిలో 24 నుంచి 30వ తేదీ వరకు గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకంగా త్రీ ఫేజ్ విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లోనూ 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. సదస్సుల ద్వారా వచ్చిన సమస్యలు ఆన్‌లైన్‌లో ఉంచి నిర్ణీత గడువులోపు పరిష్క రించేలా విద్యుత్ యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. మండల వ్యాప్తంగా పలు సమస్యలపై 27 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. ఈ సదస్సులో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ప్రతినిధి ధనంజయులు నాయుడు, ఈఈ దేవాశీర్వాదం, డీఈఈ శంకరయ్య, ఏఈ భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పాదిరేడులో గ్రామసదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

ఎస్సీ వర్గీకరణ తీర్పు రద్దుచేయాలి



వడమాలపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పును రద్దుచేయాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సుప్రీం తీర్పుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 23న తిరుపతిలో నిర్వహించే 'హలో మాల- హలో తిరుపతి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు జయంత్, రాజశేఖర్, ప్రభాకర్, వినోద్, సాయిప్రకాష్ పాల్గొన్నారు.

కార్డుదారులు ఈకేవైసీ చేసుకోవాలి

వడమాలపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులందరూ ఈనెల 30 లోగా డీలర్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ జరీనా గురువారం తెలియజేశారు.

విశ్రాంత ఉద్యోగి భాస్కరరాజుకు ఘన నివాళి



పుత్తూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి కృషి చేసిన దివంగత భాస్కరరాజు సేవలను పలువురు విశ్రాంత ఉద్యోగుల నాయకులు కీర్తించారు. ఉద్యోగుల భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుణశేఖర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం ఆయన సంస్మరణ సభ జరిగింది. ఉపాధ్యాయ ఉద్యమ సేవలకు గుర్తుగా భవనానికి భాస్కర్‌రాజు పేరును పెట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో భాస్కరరాజుతో పాటు సత్యవేడుకు చెందిన విశ్రాంత ఉద్యోగి మునీంద్రకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రి వైద్యఖర్చుల కోసం భాస్కరరాజు సతీమణి చూడామణికి రూ.2 లక్షల సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గురు రాజారావు, జయరామ్‌నాయుడు, కృపావరమ్మ, డాక్టర్ రవిరాజు, టీడీపీ నాయ కులు ఏలుమలై, జీవరత్నం నాయుడు, నారాయణ బాబు, జిల్లా నాయకులు శంకర్, సిద్ధయ్య, కుప్పయ్య, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.